PRAJASAKTI Regd.No. 15795/68

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 11 | విజయవాడ, ఆదివారం 11 ఆగస్టు 2024 | 6 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 11 August 2024 | Rs




# ఉత్త మాటలే!

వయనాడ్‌కు తక్షణ సాయం కూడా ప్రకటించని మోడీ

- జాతీయ విపత్తు ఊసే లేదు
- 'అండగా ఉంటాం' అంటూ దాటవేత
- పునరావాసం కోసం రు.2వేల కోట్ల సాయం కోరిన కేరళ ప్రభుత్వం



కొండచరియలు విరిగిపడిన ప్రాంతంలోని చూరమల బెయిలీ బ్రిడ్జిపై నడిచివెళ్తూ... నష్టాన్ని అంచనా వేస్తున్న ప్రధాని మోడీ, చిత్రంలో కేరళ సిఎం విజయన్, గవర్నర్ ఆరిఫ్‌ఖాన్, కేంద్ర మంత్రి సురేష్ గోపి

**తిరువనంతపురం :** ప్రకృతి ప్రకోపానికి గురైన కేరళ రాష్ట్రంలోని వయనాడ్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోడీ శనివారం జరిపిన పర్యటన ఆ రాష్ట్ర ప్రజలకు తీవ్ర నిరాశను మిగిల్చింది. అప్పులతో పాటు, సర్వస్వాన్ని కోల్పోయి దిక్కుతోచక విలవిలలాడుతున్న బాధితులకు ప్రధానమంత్రి అండగా ఉంటారని, తిరిగి అభివృద్ధి చేసుకోవడానికి ఉదారంగా నిధులు ప్రకటిస్తారన్న ఆశలపై ప్రధాని నీళ్లు చల్లారు. మృత్యుసీమగా మారిన ఆ ప్రాంతాన్ని కళ్లారా చూసి, బాధితులతో స్వయంగా మాట్లాడిన, అధికారులతో సుదీర్ఘంగా సమావేశమై వివరాలు సేకరించిన ప్రధాన మంత్రి తాత్కాలిక సహాయాన్ని సైతం ప్రకటించలేదు. 'ఇది సాధారణ విపత్తు కాదు. కేంద్రం సాయం చేస్తుంది. అండగా ఉంటుంది.' అన్న సాధారణ ఓదార్పు మాటలకే ఆయన పరిమితమయ్యారు. పునరావాసం కోసం రెండు వేల కోట్ల రూపాయలను సాయంగా విడుదల చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిపై ఢిల్లీ వెళ్లిన తరువాతైనా స్పందిస్తారా... అన్నది వేచిచూడాల్సిఉంది. భారత వైమానిక దళానికి చెందిన ప్రత్యేక విమానంలో మోడీ ఉదయం 11గంటల సమయంలో కన్నూర్ చేరుకున్నారు. కన్నూర్ విమానాశ్రయంలో ముఖ్యమంత్రి పినరయి విజయన్, గవర్నర్ ఆరిఫ్ మహ్మద్, కేంద్ర మంత్రి సురేష్ గోపి ప్రభృతులు ప్రధానికి స్వాగతం పలికారు. ఆ తరువాత హెలికాఫ్టర్‌లో కొండచరియలు కూలిపడిన వయనాడ్‌లో ఏరియల్ సర్వే చేశారు. ఉదయం 11.10 గంటల నుండి మధ్యాహ్నం 12.10 గంటల వరకు ఈ సర్వే సాగింది. అనంతరం 12.15 గంటలకు వయనాడ్‌లోని విపత్తు ప్రాంతంలో పర్యటించారు. సైన్యం నిర్మించిన 190 అడుగుల బెయిలీ బ్రిడ్జిని పైనుండి మోడీ నడుచుకుంటూ వెళ్లి ఆ ప్రాంతంలో పర్యటించారు. చూరమలకు చేరిన తర్వాత అక్కడి సహాయక సిబ్బందితో మాట్లాడారు అనంతరం డాక్టర్ మూపెన్ మెడికల్ కాలేజీని సందర్శించారు. అక్కడ చికిత్స పొందున్న రోగులను పరామర్శించారు. పరిస్థితి తీవ్రతను అంచనా వేసేందుకు కాల్‌పేట్‌లో వయనాడ్ కలెక్టరేట్ వద్ద సమీక్షా సమావేశంలో ప్రధాని పాల్గొన్నారు. ఈ సమావేశంలో సాయం కోసం 2 వేల కోట్ల రూపాయలు విడుదల చేయాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. కొండచరియలు కూలిన ప్రాంతాల్లో సమగ్ర పునర్నిర్మాణం అవసరమని ముఖ్యమంత్రి విజయన్ చెప్పారని పబ్లిక్ వర్క్స్ మంత్రి మహ్మద్ రియాజ్ విలేకర్లకు చెప్పారు. ఈ ప్రాంతంలో రు.1200 కోట్ల మేర నష్టం జరిగిందని రెవిన్యూ మంత్రి కె.రాజన్ చెప్పారు. కేవలం పునరావాస కార్యకలాపాల కోసమే రూ2వేల కోట్ల సాయం కోరినట్లు చెప్పారు.

## వాతావరణ మార్పులు ఎదుర్కోవడానికి సాయం చేయండి : విజయన్ విజ్ఞప్తి

వాతావరణ మార్పులు కారణంగా కేరళ తీవ్రంగా నష్టపోతోందని, వాటిని ఎదుర్కోవ డానికి సాయం చేయాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రధానమంత్రిని కోరారు. ఈ మేరకు వినతి పత్రాన్ని ఆయన మోడీకి అందచేశారు. గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పులు ప్రభావం కేరళను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని ఈ వినతిపత్రంలో పేర్కొన్నారు. తరచుగా అతి భారీ వర్షాలు, అనూహ్య వరదలు, కొండచరియలు విరిగిపడటం వంటి ప్రకృతి వైపరీత్యాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, భారత వాతావరణ కేంద్రం, జాతీయ భూకంప కేంద్రం, ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ వంటి సంస్థల ప్రాంతీయ కేంద్రాలను, ఆధునిక సాంకేతికతో రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని కోరారు. విపత్తు జరిగిన తీరును, నష్టానికి సంబంధించిన ప్రాథమిక వివరాలను నోట్‌రూపంలో ప్రధానికి విజయన్ అందజేశారు.

పూర్తిస్థాయి వివరాలతో సవివరమైన వినతిపత్రాన్ని తర్వాత కేంద్రానికి అందజేస్తామని పేర్కొన్నారు. సాధ్యమైనంత త్వరగా ఈ విపత్తును జాతీయ విపత్తుగా ప్రకటించాలని కోరారు. కొట్టాయం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్లైమేట్ ఛేంజ్ స్టడీస్ సెంటర్‌కు, కేరళ క్లైమేట్ ఛేంజ్ అడాప్టేషన్ మిషన్‌ను ఉదారంగా నిధులు సమకూర్చాలని విజ్ఞప్తి చేశారు.

# అమరావతిలో ప్రపంచబ్యాంకు బృందం

- సిఆర్‌డిఎలో సమీక్ష, నిర్మాణాల పరిశీలన
- రుణ ప్రతిపాదనపై చర్చ
- రూ.15వేలు కోట్లు కోరిన ప్రభుత్వం
- నేడు మరోసారి సమావేశం

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

ప్రపంచ బ్యాంకు ప్రతినిధి బృందం శనివారం అమరావతిలో పర్యటించింది. తొలుత అధికారులతో సమీక్షించిన అనంతరం రాజధాని పరిధిలో కట్టడాలు, ఇతర నిర్మాణాలు, ప్రస్తుత స్థితిని పరిశీలించింది. నలుగురు ఉన్నతాధి కారులు, ఎనిమిది మంది సహాయకుల బృందం శనివారం ఉదయం సిఆర్‌డిఎ కార్యాలయానికి చేరుకుంది. రాజధాని నిర్మాణ రుణ ప్రతిపాదనల గురించి చర్చించినట్లు సమాచారం. రాజధాని అమరావతికి ఎటువంటి సహాయం కావాలి, ఏ పద్ధతుల్లో తీరుస్తారు అనే అంశాలపై అధికారుల ను అడిగి తెలుసుకున్నారు. కనీసం రూ.15 వేల కోట్లు రుణంగా ఇవ్వాలన్న రాష్ట్రప్రభుత్వ అభ్యర్థనపై ఆదివారం ప్రపంచబ్యాంకు బృందం అధికారులతో సమావేశం కానుంది. అమరావతి సస్టయినబల్ క్యాపిటల్ సిటీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు (ఎఎస్‌సిసిడిపి)కు సంబంధించిన అంశా లను అధికారులు ప్రపంచబ్యాంకు ప్రతినిధుల ముందుంచినట్లు తెలిసింది. 2016లో ప్రపంచ బ్యాంకుకు రూపొందించిన ప్రాజెక్టు నివేదిక (పి159808)కు సంబంధించిన అంశమూ చర్చకు వచ్చింది. అప్పట్లో ప్రతిపాదించిన లెక్కలను కొంత సవరించినట్లు సమాచారం.

**ఇదీ ప్రభుత్వ ప్రతిపాదన**

విశ్వసనీయ సమాచారం ప్రకారం 2050 నాటికి అమరావతి నగరంలో 3.5 మిలియన్ ప్రజలు ఉంటారని, వారికి అన్ని సదుపాయాలు కల్పించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. 20 శాతం ఏరియాను గ్రీన్, బ్లూ ఏరియాగా మారుస్తామని, నగరంలో ఉండే ప్రతిపౌరుడూ కాలినడక దూరంలో పార్కును చేరుకునేలా ప్లాన్ చేశామని పేర్కొన్నారు. రోడ్లు, యుటిలిటీ కారిడార్లు, గ్రామీణ సదుపాయాల మెరుగుదల (మంచినీరు, సీవరేజీ, విలేజ్‌రోడ్లు, కనెక్టివిటీ, ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) వరద ముంపు నివారణ కాలువల మెరుగుదలకు అవసరమైన నిధులు రుణంగా ఇవ్వాలని ప్రపంచబ్యాంకు ప్రతినిధులను కోరారు. దీనికోసం రూ.40 వేల కోట్లు అవసరమని, తాత్కాలికంగా రూ.15 వేల కోట్లు ఏర్పాటు చేస్తే వెసులుబాటుగా ఉంటుందని పేర్కొన్నట్లు తెలిసింది. ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు క్యాపిటల్ సిటీ ఏరియాను పరిశీలించాలని కోరగా సిఆర్‌డిఎ అధికారులు తీసుకెళ్లారు.

# 'అదాని' కుంభకోణంలో సెబి ఛైర్‌పర్సన్?

- ఆఫ్‌షోర్ సంస్థల్లో పెట్టుబడులు!
- మరో బాంబు పేల్చిన హిండెన్‌బెర్గ్
- కుప్పకూలనున్న షేర్ మార్కెట్?



అదాని



మాధబి పురి బచ్

**న్యూఢిల్లీ :** హిండెన్‌బర్గ్ సంస్థ మరో బాంబు పేల్చింది. భారత్‌కు సంబంధించి మరో సంచలన విషయాన్ని బయట పెట్టనున్నట్లు శనివారం ప్రకటించిన ఆ సంస్థ ఆ తరువాత కొన్ని గంటల్లోనే ఏకంగా సెబీ ఛైర్‌పర్సన్ పై తీవ్ర ఆరోపణలు చేసింది. ఈ ఆరోపణల ప్రభావం షేర్‌మార్కెట్‌పై తీవ్రంగానే ఉంటుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. గతంలో విడుదల చేసిన నివేదికలో అదాని అక్రమాలను వెల్లడించిన హిండెన్‌బర్గ్ తాజా నివేదికలో ఆ అక్రమాలకు కారణమైన అదాని ఆఫ్‌షోర్ సంస్థల్లో సెబి ఛైర్‌పర్సన్ మాధబి పురి బచ్‌కు, ఆమె భర్త ధావల్ బచ్‌కు వాటాలు ఉన్నాయని పేర్కొంది. అదాని సంస్థల షేర్ల విలువలు కృత్రిమంగా పెంచడానికి వినియోగించిన మారిషస్ ఫండ్లలో మాధబి పురి బచ్. ఆమె భర్త పెట్టుబడులు పెట్టారని పేర్కొంది. ఈ మేరకు విజిల్ బ్లోయర్ నుండి సమాచారం అందినట్లు పేర్కొంది. గౌతమ్ అదాని సోదరుడు వినోద్ అదాని నిర్వహిస్తున్న మారిషస్, బెర్ముడాలోని రెండు షెల్ కంపెనీలో కూడా వీరు పెట్టుబడులు పెట్టారని తెలిపింది. అదాని కుంభకోణం వెలుగులోకి వచ్చిన తరువాత కూడా పెట్టుబడులపై వారు పెదవి విప్పకపోవడాన్ని, అదానీ గ్రూపు సంస్థల షేర్ల విలువను కృత్రిమంగానైనా పెంచడానికి సెబి ఆసక్తి చూపడాన్ని హిండెన్‌బర్గ్ ప్రస్తావించింది. అదానీ కుటుంబ నియంత్రణలో ఉన్న వివిధ సంస్థల్లో మాధబి బచ్, ఆమె భర్త 10 మిలియన్ల డాలర్లు పెట్టుబడులుగా పెట్టారని పేర్కొంది. 2017 మార్చి 21న సెబీ ఛైపర్సన్‌గా మాధబి బచ్ నియమితులయ్యే కొద్ది వారాల ముందు ఈ పెట్టుబడులను పెట్టారని, దీనికోసం మాధబి భర్త ధవల్ బచ్ మారిషస్ ఫండ్ అడ్మినిస్ట్రేటర్ ట్రైడెంట్ ట్రస్ట్‌కు ఒక లేఖ కూడా రాసారని తెలిపింది.

## ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి పదవి కోసం

# పోటాపోటీ!

## రేసులో నలుగురు రాజ్యసభ మాజీ సభ్యులు



కంభంపాటి రామ్మోహనరావు



గల్లా జయదేవ్



రఘురామ కృష్ణరాజు



సుజనా చౌదరి

**ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి**

నామినేటెడ్ పదవులపై ముఖ్యమంత్రి చంద్రబాబు కసరత్తు ప్రారంభించిన నేపథ్యంలో ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి పదవి కోసం నలుగురు రాజ్యసభ మాజీ సభ్యుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. కంభంపాటి రామ్మోహనరావు, గల్లా జయదేవ్, రఘురామ కృష్ణరాజు, సుజనా చౌదరి.. ఆ పదవిని ఆశిస్తుండటంతో పాటు తమకు ఇస్తే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి ఒనగూరే ప్రయోజ నాల గురించి, తమ గుణగణాలపైనా చంద్రబాబు ముందు, వారి సన్నిహితుల వద్ద ఏకరువు పెట్టినట్లు సమాచారం. బిజెపి ఎంఎల్‌ఎగా ఉన్న సుజనా చౌదరి ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి పదవిని కోరడం కూటమి పార్టీల్లో హాట్ టాపిక్‌గా మారింది. కాగా చంద్రబాబు మాత్రం కంభంపాటి వైపు మొగ్గు చూపుతున్నారని టిడిపి వర్గాలు గుసగుసలాడుతు న్నాయి. తాను గతంలో టిడిపి నుంచి రాజ్యసభ సభ్యునిగా ఉండి మోడీ ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా పని చేశానని, ఆ అనుభవంతోపాటు, బిజెపి అగ్ర నేతలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని సుజనా చౌదరి వాదిస్తున్నారు. టిడిపి-జనసేన-బిజెపి కూటమిలో నామినేటెడ్ పదవులను 60, 30,10 నిష్పత్తిలో పంపిణీ జరగాలని ప్రాథమికంగా మూడు పార్టీల మధ్య అవగాహన కుదిరినందున, ఢిల్లీ ప్రతినిధి పోస్టును తనకు ఇవ్వాలని పట్టుబడుతు న్నారని చర్చ సాగుతోంది. రెండు సార్లు గుంటూరు ఎంపిగా పని చేసి, జగన్ ప్రభుత్వం వేధింపులతో వ్యాపారపరంగా నష్టపోయి, ఎన్నికల్లో ఎంపి సీటును త్యాగం చేసిన తనకు ఢిల్లీ ప్రతినిధి పదవి ఇవ్వాలని గల్లా జయదేవ్ అంటున్నారు. ఎంపిగా చేసిన తనకు ఢిల్లీలో బిజెపి నేతలతో సత్సంబంధాలున్నాయని, ఒక విధంగా బిజెపి-టిడిపి పొత్తుకు ఢిల్లీలో కృషి చేశానని, జగన్ ప్రభుత్వ కక్ష సాధింపులను ఎదుర్కొన్నానని, ఎంపి సీటును వదలుకొని ఎంఎల్‌ఎ అయ్యానని, అందుకే తనకు ఢిల్లీ ప్రతినిధిగా నియ మించడం న్యాయమని రఘురామ చెబుతున్నారు. ఇక గతంలో ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా పని చేసిన అనుభవం తనకే ఉందని, బిజెపితో పాటు కాంగ్రెస్, ఇతర అన్ని రాజకీయ పార్టీల నేతలతో సంబంధాలున్నాయని, గతంలో నియమితులైన పార్టీ రాజ్యసభ సభ్యుల్లో తానే అత్యంత సీనియర్‌నని, అందుకే తనకు పదవి ఇవ్వాలని కంభంపాటి కోరుతు న్నారు. చంద్రబాబు మాత్రం ఈ పదవిపై ఆచితూచి అడుగు లేస్తున్నారు. ఢిల్లీలో బిజెపి ప్రభుత్వంలో అన్ని కార్యాలూ చాక చక్యంగా చక్కబెట్టే వారి కోసం అన్వేషిస్తున్నారు. చివరికి ఎవరి వైపు మొగ్గు చూపుతా రోనని కూటమి పార్టీలు ఆసక్తిగా ఉన్నాయి. ఇదిలా ఉండగా ఢిల్లీ ప్రతినిధి పదవి కోసం రేస్‌లో ఉన్న నలుగురూ స్వతహాగా బడా వ్యాపారులు కావడం గమనార్హం. కేబినెట్ ర్యాంక్‌తో పాటు అత్యంతక కీలక పదవి కావడంతో పోటీ తీవ్రంగా ఉంది.

# గ్రామసభల్లోనే 'ఉపాధి'

- రాష్ట్రమంతా ఒకేసారి నిర్వహిస్తాం : పవన్ కల్యాణ్
- గత ప్రభుత్వ 'జల్‌జీవన్' పనులపై పల్స్ సర్వే

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం అమలు కోసం రాష్ట్రమంతా ఒకేసారి గ్రామసభలు నిర్వహించాలని నిర్ణయించినట్లు డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రకటించారు. రాష్ట్రంలోని 13,326 పంచాయతీల్లో ఒకేసారి గ్రామసభలు నిర్వహించి ఈ చట్టం కింద చేపట్టాల్సిన పనుల గురించి నిర్ణయం తీసుకుంటామని శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏ పనులు చేయాలి? దేనికి ప్రాధాన్యం ఇవ్వాలి? ఎలాంటి పనులకు ఆమోదం తెలపాలి? అనే విషయాలను గ్రామసభల్లో చర్చించి నిర్ణయం తీసుకుంటారన్నారు. ఉపాధి నిధులతో కొత్తకళ తీసుకురావడం, ఆయా గ్రామాల్లో ఉన్న సౌకర్యాలు, మౌలిక వసతుల పెంపు వంటి అంశాలను చర్చించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించామన్నారు. ఆయా గ్రామాలకు ఏయే పనులు అవసరమో గుర్తించి వెంటనే ఉపాధి పథకంలో చేపట్టేలా చొరవ తీసుకుంటామన్నారు. కేంద్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జల్‌జీవన్ మిషన్ పథకం కింద గత ఐదేళ్లలో రూ.4వేలకోట్లు ఖర్చు పెట్టినట్లు అధికారులు చెబుతున్నారని, వాటి ప్రతిఫలాలు క్షేత్రస్థాయిలో అందలేదని తెలిపారు. జల్‌జీవన్‌మిషన్ పనుల వాస్తవ పరిస్థితి తెలుసుకునేందుకు పల్స్ సర్వే నిర్వహించాలని ఆదేశించామన్నారు. సర్వేలో వెలుగుచూసే అంశాలను ప్రజల ముందుంచి, జల్‌జీవన్‌మిషన్ నిధులను, పథకాన్ని సమర్థంగా ఎలా ఉపయోగించుకోవాలో నిర్ణయిస్తామన్నారు. గ్రామ సర్పంచ్‌ల ఆత్మగౌరవం తగ్గకుండా చూస్తామని పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున సైనికులు, పారిశుధ్య కార్మికులను సత్కరించేలా కార్యక్రమాలు రూపొందించాలని సర్పంచ్‌లను కోరారు. సర్పంచ్‌ల వ్యవస్థ బలోపేతానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు.



# ఇజ్రాయిల్ నరమేధం

- గాజాలో స్కూలుపై బాంబుల వర్షం
- వందమందికి పైగా పాలస్తీనియన్ల దుర్మరణం
- ఇజ్రాయిల్ దాష్టీకాన్ని ఖండించిన పలు దేశాలు
- అమెరికా, ఇయు ఆయుధాలతో ఊచకోత : ఐరాస రాయబారి

**గాజా :** ఇజ్రాయిల్ మరోసారి నరమేధానికి పాల్పడింది. నిర్వాసితులైన పాలస్తీనియన్లు తల దాచుకున్న విద్యాలయాలు లక్ష్యంగా చేసుకుని దాడులు కొనసాగిస్తున్న ఇజ్రాయిల్ తాజాగా శనివారం గాజా సిటీ స్కూల్‌పై జరిపిన దాడిలో వందమందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. అనేక మంది గాయాల పాలయ్యారు. బాంబు దాడి తీవ్రత ఎంత భీకరంగా వుందంటే చాలావరకు మృతదేహాలు ఛిద్రమై చెల్లాచెదురుగా పడ్డాయి. అంత దారుణ స్థితిలో వున్న మృత దేహాలను చూసి మిగతా 2లో

# బాలలపై లైంగిక వేధింపులు పెరిగాయి

## హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్




సదస్సులో మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్

**ప్రజాశక్తి- గుంటూరు**

దేశంలో లైంగిక వేధింపులకు గురైన బాలల సంఖ్య పెరిగిందని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ఆందోళన వ్యక్తం చేశారు. విభిన్న ప్రతిభావంతులు, బాలల హక్కుల పరిరక్షణపై గుంటూరు కలెక్టరేట్‌లోని ఎస్ఆర్.శంకరన్ హాల్లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు (జువెనైల్ జస్టిస్ కమిటీ) ఆధ్వర్యంలో శనివారం జరిగిన వార్షిక రాష్ట్ర స్థాయి భాగస్వాముల సదస్సును ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ప్రారంభించి మాట్లాడారు. నేషనల్ క్రైమ్ రికార్డ్సు బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) 2023 రికార్డుల ప్రకారం దేశ వ్యాప్తంగా 1.62 లక్షల మంది బాలలపై నేరాలు జరిగాయని, 83,350 మంది బాలలు మిస్ అయినట్లు కేసులు నమోదయ్యాయని తెలిపారు. కిడ్నాపింగ్, బలవంతపు నేరాలు 45 శాతం ఉన్నాయని వివరించారు. దేశంలో లైంగిక వేధింపులకు గురైన బాలల సంఖ్య 2021 సంవత్సరం కంటే 2022లో పెరిగిందని తెలిపారు. రాకెట్ సైన్స్ నేర్చుకుంటోన్న ఈ రోజుల్లో కూడా బాలలపై దాడులు ఎక్కువ జరుగుతున్నాయని విచారం వ్యక్తం చేశారు. చట్టంతో విభేదించిన బాలల సంఖ్య చాలా తక్కువగా ఉందని, కానీ రక్షణ, సంరక్షణ అవసరమైన బాలల సంఖ్య చాలా ఎక్కువగా ఉందని తెలిపారు. బాలలపై నేరాలకు పాల్పడిన వారికి పోస్కో చట్టం కింద కఠినమైన శిక్షలు వేస్తున్నా, నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్‌సిఆర్‌బి రికార్డుల ప్రకారం లైంగిక దాడులు జరిగిన 1,004 కేసుల్లో 900 కేసులు తెలిసిన వారి వల్ల జరిగినవే వివరించారు. బాలలు బలహీనులు, ఏమి చేయలేరు, ఎవరికీ చెప్పుకోలేరు అని అనుకొని వారిపై లైంగిక నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు. బాలలపై నేరాలకు పాల్పడిన వారికి పోస్కో, జువైనల్ జస్టిస్ చట్టాలు, లీగల్ ప్రోవిజన్స్ ప్రకారం అమలు చేసే కఠిన చట్టాలపై పాఠశాల, కళాశాల స్థాయి విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ సదస్సులో జువైనల్ జస్టిస్ కమిటీ ఛైర్‌పర్సన్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.నరేందర్, జువైనల్ జస్టిస్ కమిటీ సభ్యులు డాక్టర్ జస్టిస్ విఆర్‌కె కృపాసాగర్, జస్టిస్ కిరణ్మయి మండవా, జస్టిస్ వెంకటజ్యోతిర్మయి ప్రతాప, జస్టిస్ వి.సుజాత, తిరుపతి జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యులు సంధ్యారాణి, ఎపి లీగల్ సెల్ అథారిటీ మెంబరు సెక్రటరీ ఎ.భవిత, జిల్లా జడ్జి వైవిఎస్.బి.జి.పార్థసారథి, వివిధ శాఖల రాష్ట్ర ఉన్నతాధికారులు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# కేబినెట్ కార్యదర్శిగా టివి సోమనాథన్

**న్యూఢిల్లీ :** తదుపరి కేంద్ర కేబినెట్ కార్యదర్శిగా సీనియర్ ఐఎఎస్ అధికారి టివి సోమనాథన్‌ను శనివారం నియమించారు. తమిళనాడు క్యాడర్‌కు చెందిన 1987బ్యాచ్ ఐఎఎస్ అధికారైన సోమనాథన్ ప్రస్తుతం కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా, వ్యయ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబా ఈ నెల 30న పదవీ విరమణ చేయనున్నారు. ఆయన స్థానంలో సోమనాథన్ నియామకాన్ని కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదించిందని కేంద్ర ప్రభుత్వం శనివారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ నెల 30న సోమనాథన్ కేబినెట్ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరిస్తారని, అప్పటి నుంచి రెండేళ్లపాటు పదవీలో ఉంటారని ప్రభుత్వం తెలిపింది.

## యజమానితో సంబంధం లేకుండా కౌలుకార్డులు

- వ్యవసాయశాఖ సమావేశంలో రైతు సంఘం నాయకులు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కౌలురైతు సంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కౌలురైతు సంఘాల నాయకులతో వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి రాజశేఖర్ శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కౌలు రైతుల గుర్తింపు కార్డుల మంజూరు, రుణాల మంజూరు, సంక్షేమ పథకాలు అందించే అంశాలపై కొత్త మార్గదర్శకాలు రూపొందించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు రాజశేఖర్ వెల్లడించారు. మార్గదర్శకాల కోసం మరిన్ని సమావేశాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూ.. రిజర్వ్ బ్యాంకు నిబంధనల ప్రకారం కౌలు రైతులందరికీ రూ.1.60 లక్షలు చొప్పున ఎటువంటి హామీ లేకుండా వ్యవసాయ రుణాలు మంజూరు చేయాలని కోరారు. రిటైర్డ్ ఐఎఎస్ రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. అందరికీ ఆమోదయోగ్యమైన విధి విధానాలు రూపొందిస్తామన్నారు. వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. కౌలు రైతులందరినీ 'ఇ-పంట'లో నమోదు చేయిస్తామని తెలిపారు. రిటైర్డు ఐఎఎస్ బికె అగర్వాల్, రైతు నాయకులు వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాధాకృష్ణ, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్‌యుఐ నేత సంపత్ హత్య కేసు

- నిందితులకు ముందస్తు బెయిల్ నిరాకరణ

**ప్రజాశక్తి-అమరావతి**

కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి సంఘం ఎన్ఎస్‌యుఐ జాతీయ కార్యదర్శి, న్యాయవాది సంపత్ కుమార్ హత్య కేసులో ప్రధాన నిందితులకు ముందస్తు బెయిల్ మంజూరు చేసేందుకు హైకోర్టు నిరాకరించింది. ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ కెసి కృష్ణారెడ్డి, కెసి నాగార్జునరెడ్డి, కెసి సాయి ప్రసాద్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లను డిస్మిస్ చేసింది. సంపత్ హత్యలో వారి పాత్ర ఉన్నట్లు ప్రాథమిక ఆధారాలు ఉన్నందున పిటిషన్లను డిస్మిస్ చేస్తున్నట్లు జస్టిస్ బివిఎల్ చక్రవర్తి తీర్పు చెప్పారు. శ్రీసత్యసాయి జిల్లా, హిందూపురానికి చెందిన సంపత్ కుమార్ గత మే 30న హత్యకు గురయ్యారు. అతని తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా పిటిషన్ల విచారణ సమయంలో కేసు డైరీని న్యాయమూర్తి పరిశీలించి తప్పుబట్టారు. పోలీసులు కేసు దర్యాప్తు చేసేప్పుడు పార్ట్ 1 కేసు డైరీ (సీడీ)ని రూల్స్‌కు అనుగుణంగా నిర్వహించాల్సిందేనని ఆదేశించారు. భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బిఎన్ఎస్ఎస్)లోని సెక్షన్ 192కు అనుగుణంగా కేసు డైరీలు ఉండాలన్నారు. దీనివల్ల రికార్డుల ప్రామాణికత, దర్యాప్తు సంస్థల విశ్వసనీయత పెరుగుతుందన్నారు. ఈ ఉత్తర్వులను డిజిపికి పంపి అన్ని పిఎస్‌లలో అమలు జరిగేలా చూడాలని హైకోర్టు రిజిస్ట్రీని ఆదేశించారు. పిటిషన్లను డిస్మిస్ చేస్తూ తీర్పు వెలువరించారు.



నరసరావుపేటలో ఫిర్యాదు చేస్తున్న టిడిపి నాయకులు

## మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా**

ముఖ్యమంత్రి చంద్రబాబును నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, అయన అనుచరులు ఏకవచనంతో మాట్లాడారని, అనుచిత వ్యాఖ్యలు చేశారని పలువురు టిడిపి నాయకులు శనివారం పల్నాడు జిల్లా నరసరావుపేట రూరల్, రొంపిచర్ల పోలీసు స్టేషన్లలో ఫిర్యాదులు చేశారు. ఆయనను తక్షణమే అరెస్టు చేయాలని తెలుగు యువత పల్నాడు జిల్లా అధ్యక్షులు కుమ్మెత కోటిరెడ్డి, టిడిపి అధికార ప్రతినిధి మానుకొండ జాహ్నవి, మాజీ ఎంపిపి మొండితోక రామారావు కోరారు. ఈ మేరకు ఫిర్యాదులను నరసరావుపేటలో రూరల్ ఎస్ఐ సిహెచ్ కిషోర్‌కు, రొంపిచర్లలో హెడ్ కానిస్టేబుల్ రమణకు అందజేశారు. అయితే, వీటిపై కేసులేమీ నమోదు కాలేదని సమాచారం.



## శ్రీవారి సేవలో ప్రముఖులు

**ప్రజాశక్తి -తిరుమల**

తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో ఎపి హైకోర్టు జడ్జి శ్యాం సుందర్, తెలంగాణ ఎంపి కిరణ్ కుమార్ రెడ్డి, మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్, తెలంగాణ ఎమ్మెల్సీలు సత్యవతి రాథోడ్, రఘోత్తమ్ రెడ్డి ఉన్నారు. వీరికి ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం దర్శన ఏర్పాట్లు చేసి శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# 16 నుంచి రెవెన్యూ సదస్సులు

- 15న లాంఛనంగా ప్రారంభం
- షెడ్యూల్ విడుదల చేసిన ప్రభుత్వం
- ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో నమోదు





**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

రాష్ట్ర వ్యాప్తంగా 22(ఎ)భూముల యాజమాన్య హక్కులను నిర్ధారించేందుకు ఈ నెల 16వ తేదీ నుంచి అన్ని జిల్లాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సదస్సులను స్వాతంత్ర్య దినోత్సవం రోజున (15వ తేదీన) మంత్రులు, ఎంఎల్ఎలు లాంఛనంగా ప్రారంభిస్తారని పేర్కొంది. ఈ మేరకు రెవెన్యూ సదస్సుల షెడ్యూల్‌ను శనివారం విడుదల చేసింది. జిల్లాలో ఏ రోజు ఏ రెవెన్యూ గ్రామంలో సదస్సు నిర్వహించాలనే విషయాన్ని 13వ తేదీనాటికి పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించింది. ఆయా గ్రామాల్లో ప్రభుత్వ భూములు ఏమేర అన్యాక్రాంతమయ్యాయి? అందుకు బాధ్యులైన అధికారులెవరు? అనే అంశాలను ఈ సభల్లో తొలుత గుర్తించనున్నారు. రెగ్యులర్ సదస్సులు ఈ నెల 16 నుంచి సెప్టెంబరు 30 వరకు (45 రోజులు) రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. మండల స్థాయిలో వచ్చే ఫిర్యాదులను ఎక్కడికక్కడ పరిష్కరించడంతో పాటు, వాస్తవ పరిస్థితిని, ఫిర్యాదులను ఆర్‌టిజిఎస్ ప్రత్యేకంగా తయారు చేసిన యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని ప్రభుత్వం పేర్కొంది.

**సదస్సుల నిర్వహణకు నిధులు**

సదస్సుల నిర్వహణ కోసం ప్రభుత్వం ఒక్కో జిల్లాకు రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షలు బడ్జెట్ కేటాయించింది. సదస్సుల నిర్వహణ సీనియర్ ఐఎఎస్ అధికారి (డిస్ట్రిక్ట్ స్పెషల్ ఆఫీసరు) పర్యవేక్షణలో నిర్వహించాల్సి ఉంటుంది. మండల స్థాయిలో తహశీల్దార్‌తో పాటు ఆర్ఐ, విఆర్ఒ, మండల సర్వేయరు, దేవాదాయశాఖ, వక్ఫ్ బోర్డు నుంచి ప్రతినిధి, రిజిస్ట్రేషన్‌శాఖ నుంచి ఉద్యోగి, అవసరమైన చోట అటవీశాఖ నుంచి ఉద్యోగి సదస్సుల నిర్వహణలో పాల్గొంటారు. జిల్లా స్థాయిలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మానిటరింగ్ చేయాల్సి ఉండగా, మండల స్థాయిలో డివిజన్ స్థాయి అధికారి ఆర్‌డిఒ నోడల్ ఆఫీసరుగా వ్యవహరించనున్నారు. రైతుల నుంచి తీసుకున్న ప్రతి అర్జీకి ఎకనాలెడ్జ్‌మెంట్ ఇవ్వాల్సి ఉంటుంది. పెద్ద రెవెన్యూ గ్రామమైతే రోజంతా, చిన్న గ్రామమైతే అరపూట సదస్సులు నిర్వహించాలని ప్రభుత్వం పేర్కొంది. గ్రామాల్లో రైతులకు సదస్సులపై అవగాహన కల్పించేందుకు కరపత్రాల పంపిణీ చేయడంతోపాటు సదస్సుల షెడ్యూల్‌కు సంబంధించిన వివరాలను గ్రామ పంచాయతీ, పిఎసిఎస్, కూడళ్లలో డిస్‌ప్లే చేయాల్సి ఉంటుంది.





రాజమహేంద్రవరంలో మాట్లాడుతున్న మంత్రులు రవీంద్ర, దుర్గేష్

## ఫిర్యాదులు లేకుండా ఉచిత ఇసుక విధానం

- మంత్రులు కొల్లు రవీంద్ర, కందుల దుర్గేష్

**ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్, అమలాపురం**

ఉచిత ఇసుక పాలసీ విధానాన్ని ఎటువంటి ఫిర్యాదులకు తావు లేకుండా అమలు చేయడానికి అధికారులు కృషి చేయాలని రాష్ట్ర ఎక్సైజ్, మైన్స్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక మంచి ఆశయంతో ఉచిత ఇసుక పాలసీ విధానాన్ని అమలు చేస్తోందని, ఈ పాలసీని ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లే బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. తూర్పుగోదావరి, అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్లలో ఉచిత ఇసుక సరఫరా విధానంపై మంత్రి కందుల దుర్గేష్‌తో కలిసి ఆయన శనివారం ఆయా జిల్లాల అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 47 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద ఉందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక పాలసీపై కొంత ప్రజల్లో అపోహలు ఉన్నాయని, వాటిని నివృత్తి చేయాలని సూచించారు. అదే సమయంలో ఈ రంగంపై ఆధారపడ్డ వారి జీవన భృతి కూడా దృష్టిలో ఉంచుకున్నట్టు చెప్పారు. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. పేదలకు, ఇళ్ళ నిర్మాణం చేసే వారికి ఇసుకను అందుబాటులోకి తీసుకెళ్లే క్రమంలో వాస్తవ పరిస్థితికి అనుగుణంగా లభ్యత ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఉచితంగా వినియోగదారులకు ఇసుకను అందించాలనే ఉన్నత లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి, ఆ మేరకు కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు.

## తెలంగాణలో కొత్త విమానాశ్రయాల ఏర్పాటు

- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

**ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో కొత్త విమానాశ్రయాల ఏర్పాటును పరిశీలిస్తామని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. విమానాశ్రయాల భద్రతలో అన్ని జాగ్రత్తలూ తీసుకుంటున్నట్లు తెలిపారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో ఏవియేషన్ సెక్యూరిటీ కల్చర్ వీక్‌ను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ఉన్న సమయంలోనే శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బీజం పడిందని అన్నారు. ఎయిర్‌పోర్ట్ భవిష్యత్ అవసరాల దృష్ట్యా భూసేకరణ చేస్తే, ఇంత భూమి ఎందుకు కేటాయించారని అప్పుడు పలువురు విమర్శించారని గుర్తు చేశారు. చంద్రబాబు దూరదృష్టితోనే శంషాబాద్ విమానాశ్రయానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చిందని పేర్కొన్నారు. విమాన ప్రయాణికులు విమానాశ్రయాల్లో తనిఖీలు, భద్రత పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. భద్రతా సిబ్బందికి సహకరించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. అనంతరం విమానాశ్రయ వెలుపల మొక్కలు నాటారు. అంతకుముందు నిర్వాహకులతో కలిసి 10కె రన్‌ను ప్రారంభించారు.

# విద్యుత్ సంస్థల్లో ఇంజినీర్ల కొరత

- ఐదేళ్ల నుంచి లేని నియామకాలు
- ఉన్న వారిపైనే పనిభారం



**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

విద్యుత్ సంస్థల్లో ఇంజినీర్ల కొరత వేధిస్తోంది. ఏటా ఉద్యోగ విరమణ చేస్తున్న పోస్టుల్లో కొత్త నియామకాలు చేసేందుకు ప్రభుత్వం, విద్యుత్ సంస్థలు ముందుకు రావడం లేదు. దీంతో ఉన్న ఇంజినీర్లపైనే పనిభారం పడుతోంది. ఆరేళ్లుగా ఒక్క ఇంజినీరింగ్ పోస్టుకు కూడా నోటిఫికేషన్ విడుదల కాలేదు. విద్యుత్ సంస్థల్లో ఇంజినీర్ల నియామకం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఎఇఇ) స్థాయి నుంచి ఉంటుంది. ఇక్కడ నుంచి ఉద్యోగోన్నతులు పొందుతారు. మొత్తం మూడు విద్యుత్ సంస్థల్లో మంజూరు పోస్టులు సుమారు 7,500 ఉంటే 5 వేలలోపు మాత్రమే సిబ్బంది పనిచేస్తున్నారు. 2,500 పోస్టుల వరకు ఖాళీలు ఉన్నాయి. జెన్‌కోలో 80 పోస్టులతో 2017లో చివరిసారి నియామకాలు జరిగాయి. ట్రాన్స్‌కోలో 170 పోస్టులకు, డిస్కంలలో 20 పోస్టులకు 2019లో చివరి నియామకాలు జరిగాయి. ఆ తరువాత ఇప్పటి వరకు ఒక్క నోటిఫికేషన్ కూడా ప్రభుత్వం విడుదల చేయలేదు. నెల్లూరులోని శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ ప్లాంట్ (ఎస్‌డిఎస్‌టిపిపి) మూడో యూనిట్‌కు, కడపలోని రాయలసీమ థర్మల్ విద్యుత్ ప్లాంట్ (ఆర్‌టిపిపి)లోని 600 మెగావాట్ల యూనిట్‌కు ఇప్పటి వరకు సిబ్బందిని మంజూరు చేయలేదు. ఇతర యూనిట్లలో ఉన్న సిబ్బందినే జెన్‌కో ఉపయోగిస్తోంది. అదే విధంగా విజయవాడలోని నార్ల తాతారావు థర్మల్ పవర్ ప్లాంట్(ఎన్‌టిపిపి)లో 800 మెగావాట్ల యూనిట్ ఇటీవల ప్రారంభమైంది. దీనికి కూడా సిబ్బందిని మంజూరు చేయలేదు. నియామకం లేకపోవడంతో ఉన్నవారికే ఇన్‌ఛార్జులుగా అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నారు. డిస్కంలలో ఒక్క సర్కిల్ చూడాల్సిన ఎఇ అదనంగా రెండు సర్కిళ్లను చూస్తున్న పరిస్థితి నెలకొంది. జెన్‌కో, ట్రాన్స్‌కోలో కూడా ఒక విభాగం చూడాల్సిన ఉద్యోగి అదనంగా మరో విభాగం చూడాల్సి వస్తోంది. పోస్టుల భర్తీ కోసం విద్యుత్ సంస్థలు ఆయా బోర్డు సమావేశాల్లో తీర్మానం చేసుకుని ప్రభుత్వానికి పంపాలి. అయితే ఇప్పటి వరకు జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కం యాజమాన్యాలు ఇలాంటి ప్రతిపాదనలు పంపలేదు. పై స్థాయిలో ఉద్యోగ విరమణ చేయడంతో ఎఇఇ కేడర్ ఉద్యోగి ఉద్యోగోన్నతి పొందుతున్నారు. ఉద్యోగోన్నతి ద్వారా ఖాళీ అయిన పోస్టులను యాజమాన్యాలు అలానే వదిలేస్తున్నాయి. ఇటీవల విద్యుత్ సంస్థల్లో సుమారు 500 మంది ఉద్యోగులు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. తమపై పని ఒత్తిడి తీవ్రంగా ఉందని, పోస్టులు భర్తీ చేయాలని ఉద్యోగులు ప్రభుత్వానికి, విద్యుత్ సంస్థల యాజమాన్యాలకు పలుసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. టిడిపి కూటమి ప్రభుత్వంలోనైనా పోస్టుల భర్తీ చేయాలని ఇంజినీర్లు కోరుతున్నారు. ఈ అంశంపై విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఎపిఎస్‌ఇబి అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఇటీవల వినతిపత్రం అందజేసింది. సరిపడా సిబ్బంది లేకపోవడంతో తమపై తీవ్రమైన పని భారం పడుతుందని తెలిపారు. ఇది విద్యుత్ సంస్థలతోపాటు వినియోగదారులపైనా ప్రభావం చూపుతుందని వివరించారు.

**లక్షల్లో ఇంజినీరింగ్ నిరుద్యోగులు**

ఇంజినీరింగ్‌లో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు విద్యుత్ సంస్థల్లో పనిచేసేందుకు అర్హులు. ఈ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు ఉద్యోగాలు లేక లక్షల మంది ఖాళీగా ఉన్నారు. విద్యుత్ సంస్థల్లో పోస్టుల భర్తీ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారు.

## ఆటో, కారు ఢీ

- ఆశ్రమ పాఠశాల విద్యార్థి మృతి
- మరో నలుగురు విద్యార్థులకు గాయాలు

**ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో**

ఆటో, కారు ఢీకొనటంతో ఆటోలో ఉన్న గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థి మృతిచెందాడు. మరో నలుగురు విద్యార్థులకు గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం ఎటపాకలో శనివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం బండారుగూడెం గ్రామానికి చెందిన కుంజ దీపక్(13), అతని తమ్ముడు కుంజ అనిల్(6వ తరగతి), కాటిబోయిన కార్తీక్ (8వ తరగతి), కాటిబోయిన జస్వంత్(9వ తరగతి), అశ్వాపురం మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన తాటి అఖిల్(10వ తరగతి) కొత్తపల్లి ఆశ్రమ పాఠశాలలో చదువుతున్నారు. ఈ ఐదుగురు శనివారం ఉదయం వార్డెన్‌కు చెప్పకుండా బయటకు వచ్చి ఆటోలో స్వగ్రామాలకు బయలుదేరారు. ఆటో డ్రైవర్‌కు ఎడమ వైపున దీపక్, జస్వంత్ కూర్చున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం తునికి చెరువు గ్రామం వద్ద ఆటో, కారు ఢీకొన్నాయి. దీంతో ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో దీపక్ తలకు బలమైన గాయం కావడంతో చెవి, ముక్కుల నుంచి తీవ్ర రక్తం వచ్చి అక్కడికక్కడే మృతిచెందాడు. మిగతా విద్యార్థులు స్వల్పంగా గాయపడ్డారు. వారిని భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న విద్యార్థుల కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలివచ్చారు. మృతిచెందిన దీపక్, మరో నలుగురు విద్యార్థులు తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే గోడ దూకి వెళ్లారని వార్డెన్ వివరించారు. ఎటపాక పోలీసులు ఆటో, కారు డ్రైవర్లను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఖమ్మంలో డ్రగ్స్ కలకలం

- క్రిప్టో కరెన్సీతో కొనుగోలు.. అస్సాం నుంచి పార్సల్

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో సహకారంతో ఖమ్మం టూ టౌన్ పోలీసులు డ్రగ్స్ రాకెట్‌ను ఛేదించారు. డ్రగ్స్ వినియోగిస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 2.5 గ్రాముల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ జులై 31న డార్క్ వెబ్ ద్వారా ఆర్డర్ చేశాడు. అస్సాం రాష్ట్రానికి చెందిన సిల్చఖురి నుంచి క్రిప్టో కరెన్సీ ఆధారంగా డ్రగ్ తెప్పించుకున్నాడు. స్పీడ్ పోస్టు ద్వారా ఈనెల 8వ తేదీన ఆ డ్రగ్ సంబంధిత చిరునామాకు చేరింది. దీనిని సదరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ తీసుకుంటున్న సమయంలో పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

## తెలంగాణలో అధికారంలోకి వస్తాం

- త్వరలో అధ్యక్షుడి నియామకం : చంద్రబాబు

**ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో అధికారంలోకి రావడమే లక్ష్యమని ఆ పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. టిటిడిపికి త్వరలోనే అధ్యక్షుడిని నియమిస్తామని చెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని ఎన్‌టిఆర్‌భవన్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'చాలా రోజులైంది..అందరినీ చూసేందుకు వచ్చా..పార్టీ కోసం కష్టపడ్డ వారికి నేను రావడం ఉత్సాహానిస్తుంది.. తెలంగాణలో పార్టీని బలోపేతం చేయాలని అభిమానులు, కార్యకర్తలు కోరుతున్నారు.. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో గత ఎన్నికల్లో పోటీచేయలేదు, అధ్యక్షుడిని నియమించలేదు.. ఇక్కడి ప్రజల మనోభావాలను గౌరవిస్తా.. త్వరలోనే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిని నియమిస్తా.. ఒకప్పుడు తెలంగాణలో తెలుగుదేశం బలమైన పార్టీ.. కొన్ని కారణాలతో బలహీనమయ్యాం.. సామరస్యంగా మంచి వాతావరణంలో రెండు రాష్ట్రాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా' అని చంద్రబాబు వివరించారు. తెలంగాణలో త్వరలో గ్రామస్థాయి నుంచి పార్టీ నిర్మాణంపై దృష్టిపెడతామని చెప్పారు. 15 రోజుల్లో తెలంగాణలో సభ్యత్వ నమోదు ప్రక్రియ ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు. సభ్యత్వ నమోదు తర్వాతనే టిటిడిపి అధ్యక్షుడి ఎన్నిక ఉంటుందని స్పష్టం చేశారు. టిటిడిపిలో పాత కమిటీలను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. పార్లమెంటు, అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఉన్న కమిటీల స్థానంలో కొత్త వారిని నియమిస్తామన్నారు. ప్రతినెలా రెండో శనివారం , ఆదివారం తెలంగాణకు వస్తానని చెప్పారు.

## అడుగడుగునా 'ఉక్కు'ను దెబ్బతీసే కుట్రలు

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

**ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)**

ఉక్కు సంకల్పం

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేసే క్రమంలో అడుగడుగునా పాలకులు కుటిలయత్నాలకు పాల్పడుతున్నారని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారానికి 1276వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఎటిఐయుసి స్టీల్‌ప్లాంట్ అనుబంధ యూనియన్ల కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌పై జరుగుతున్న కుట్రలను అడ్డుకుని తీరుతామన్నారు. రూ.లక్షల కోట్ల విలువైన ప్లాంట్‌ను కారుచౌకగా కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తహతహలాడుతోందన్నారు. ప్లాంట్‌లో ఒక్కో విభాగాన్నీ నిర్వీర్యం చేసేందుకు యత్నిస్తోందని తెలిపారు. కర్మాగారాన్ని నష్టపరిచే చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ వంటి పెద్ద ప్రభుత్వ రంగ సంస్థను నిర్వీర్యం చేయాలని చూస్తున్న వారికి భవిష్యత్తులో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. రానున్న కాలంలో ఐక్య పోరాటాలను మరింత ఉధృతం చేయనున్నట్టు తెలిపారు.

## అసైన్డ్ భూములకు జనరల్ ప్యాకేజ్

- టిడిపి గ్రీవెన్స్‌లో కోరిన అమరావతి రైతులు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాజధాని అమరావతి నిర్మాణానికి భూ సమీకరణ ద్వారా తీసుకున్న అసైన్డ్ భూములకు జనరల్ ప్యాకేజ్ ఇప్పించి న్యాయం చేయాలని అమరావతి ప్రాంత అసైన్డ్ ఎస్‌సి, ఎస్‌టి రైతులు కోరారు. టిడిపి కార్యాలయంలో శనివారం గ్రీవెన్స్ నిర్వహించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్‌యాదవ్‌తో పాటు పెదకూరపాడు ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. అసైన్డ్ భూములకు జనరల్ ప్యాకేజ్ ఇప్పించాలని కోరారు. గత ప్రభుత్వంలో జరిగిన భూ సర్వేలో తన భూ రికార్డులను తారుమారు చేసి అన్యాయం చేశారని గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం కర్నూతల గ్రామానికి చెందిన లింగాబత్తిని ఉమాలక్ష్మి ఫిర్యాదు చేశారు. అవుట్‌సోర్సింగ్, లేదా కాంట్రాక్టు బేసిక్ విధానంలో ఉద్యోగాలు కల్పించాలని జాతీయ వ్యవసాయ పంట బీమా కార్యకర్తలు కోరారు. మండల, మున్సిపాల్టీల్లో కుండల తయారీ, విక్రయింపుల కోసం శాశ్వత స్థలాలు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ కుమ్మరి శాలివాహన సంఘం నేతలు విజ్ఞప్తి చేశారు. పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తించి నామినేటెడ్ పదవులు కల్పించాలని టిడిపి నేతలు వందల అర్జీలు ఇచ్చారు.

**పెద్దిరెడ్డి బినామీ కైలే అనిల్ : వర్ల కుమార్ రాజా**

పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి బినామీగా ఉన్నారని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా విమర్శించారు. మదనపల్లె ఫైల్స్ దగ్ధం వెనుక కూడా అనిల్ కుట్ర ఉందని ఆరోపించారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్, పామర్రు, పుంగనూరు మొత్తం రాష్ట్రంలో పెద్దిరెడ్డికి బినామీలు ఉన్నారని విమర్శించారు. కులాల మధ్య చిచ్చు పెట్టేందుకు జగన్, అతని టీమ్ ప్రచారం మొదలుపెట్టిందని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మహాసేన రాజేష్ విమర్శించారు. అంబేద్కర్ పేరు తీసేసి వైఎస్ఆర్ విదేశీ విద్యా దీవెన పెట్టుకున్నారని పేర్కొన్నారు.





ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్సీలు ఐ.వెంకటేశ్వర్లు, లక్ష్మణరావు

## విజయాల స్ఫూర్తితో ముందుకు

- యుటిఎఫ్ దినోత్సవంలో ఎమ్మెల్సీలు ఐవి, లక్షణరావు

**ప్రజాశక్తి - అమలాపురం (కోనసీమ జిల్లా)**

గడచిన 50 ఏళ్లలో యుటిఎఫ్ సాధించిన విజయాల స్ఫూర్తితో నాటి నాయకుల త్యాగ నిరతి, అంకితభావం, సమాజ శ్రేయస్సు కోసం వారు చేసిన కృషిని స్మరించుకుంటూ వారి అడుగు జాడల్లో యుటిఎఫ్ నడవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. యుటిఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని యుటిఎఫ్ భవన్‌లో సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సదస్సులో ఎమ్మెల్సీ కెఎస్ లక్షణరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు మెరుగైన పిఆర్‌సి, పెండింగ్ వేతనాలు, సరెండర్ లీవ్స్, పిఎఫ్, ఎపి జిఎల్ఐ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం విడుదల చేస్తున్న శ్వేత పత్రాల్లో గత ప్రభుత్వం వైఫల్యాలే తప్ప ఈ ప్రభుత్వం ఏమి చేస్తుందన్న అంశం లేదని విమర్శించారు. మరో ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు సామాజిక బాధ్యతను కలిగి ఉండాలని తెలిపారు. మరొక 50 సంవత్సరాలపాటు విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేయడానికి ప్రతి ఒక్కరూ నడుము బిగించాలని కోరారు. సదస్సులో యుటిఎఫ్ పూర్వ అధ్యక్షులు జోజయ్య, రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. యుటిఎఫ్ ఆవిర్భావం నుంచి నేటి వరకు ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయ సంక్షేమమే పరమావధిగా పని చేస్తున్నదని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే వైఖరిని కొనసాగిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాసరావు, కార్యదర్శులు ఎ.మల్లేశ్వరరావు, ఎస్‌పి.మనోహర్, అన్నారం, ఎస్.జ్యోతిబసు, అరుణకుమారి, బి.లక్ష్మీరాజా, నాయకులు పాల్గొన్నారు.

## ఇజ్రాయిల్ నరమేధం

మొదటిపేజి తరువాయి

డాక్టర్లు కూడా భయకంపితులవుతున్నారు. గాజా విద్యాసంస్థలు లక్ష్యంగా ఇజ్రాయిల్ ఇటీవల కాలంలో చేసిన పదో దాడి కాగా, ఈ నెలలోనే ఎనిమిదో దాడి. అల్ అహ్లి అరబ్ ఆస్పత్రికి వరుసగా మృతదేహాలను, క్షతగాత్రులను తీసుకుని వస్తూనే వున్నారు. ఉదయం ప్రార్థనల సమయంలో ఈ దాడి జరిగింది. ఇప్పటివరకు వందకు పైగానే మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. హమాస్, పాలస్తీనా ఇస్లామిక్ జిహాద్ సంస్థలకు చెందిన 20 మందికిపైగా తీవ్రవాదులున్నందునే దాడి చేశామన్న ఇజ్రాయిల్ అందుకు సంబంధించిన ఎటువంటి సాక్ష్యాధారాలను చూపలేదు. ఈ దాడిని ఈజిప్ట్, జోర్డాన్, సౌదీ అరేబియా, ఖతార్, ఇరాన్, ఇయు సహా పలు దేశాలు తీవ్రంగా ఖండించాయి. అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమేనని విమర్శించాయి. గాజాపై గత 10మాసాలుగా కొనసాగుతున్న దాడుల్లో ఇప్పటివరకు 39,790మంది మరణించగా, 92702 మంది గాయపడ్డారు. చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధులుసహా అమాయక పౌరులను దారుణంగా హత్య చేస్తున్న ఇజ్రాయిల్‌కు గుడ్డిగా మద్దతు ఇవ్వడాన్ని ఇప్పటికైనా అమెరికా ఆపాలని పాలస్తీనా అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్ అన్నారు.

**చర్చల ప్రక్రియను దెబ్బతీయడానికే దాష్టీకాలు : యుఎన్ఆర్‌డబ్ల్యుఎ, ఇయు**

ఒక పక్క కాల్పుల విరమణ ఒప్పందం కోసం చర్చలు జరగాలని కసరత్తు చేస్తుంటే మరోపక్క ఇలా స్కూళ్లపై దాడులు చేయడమంటే ఆ ప్రతిపాదిత చర్చలను దెబ్బతీయడమేనని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గాజా దారుణాల్లో ఇది మరో రోజని ఐక్యరాజ్య సమితి పాలస్తీనా శరణార్థుల వ్యవహారాల సంస్థ (యుఎన్ఆర్‌డబ్ల్యుఎ) అధినేత వ్యాఖ్యానించారు. తక్షణమే కాల్పుల విరమణ జరగాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ఊచకోతలను ఏ రకంగానూ సమర్థించుకోలేరని యురోపియన్ యూనియన్ విదేశీ వ్యవహారాల ప్రతినిధి జోసెఫ్ బోరెల్ వ్యాఖ్యానించారు. అమాయకులైన పౌరుల హత్యలను ఆపగలిగేది, బందీలైన ఇజ్రాయిలీల విడుదలకు మార్గం సుగమం చేసేది కాల్పుల విరమణ ఒప్పందమేనని, అటువంటి దాన్ని వ్యతిరేకిస్తున్నారంటూ ఇజ్రాయిల్ ఆర్థిక మంత్రిని ఆయన విమర్శించారు. ఆ స్కూలుపై దాడిని కతార్ విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది. నిర్వాసితులైన, నిరాయుధులైన పౌరులపై ఇటువంటి కిరాతకమైన దాడి జరపడమంటే వారి ప్రాథమిక హక్కులన్నీ దారుణంగా ఉల్లంఘిస్తున్నట్లేనని విమర్శించింది. స్కూళ్లపై జరుపుతున్న దాడులపై వెంటనే స్వతంత్ర ఐక్యరాజ్య సమితి దర్యాప్తు అధికారులతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సౌదీ అరేబియా కూడా ఈ దాడిని తీవ్రంగా ఖండించింది. తక్షణమే ఈ ఊచకోతలను ఆపాలని డిమాండ్ చేసింది.

**ఇవన్నీ ఊచకోతలే : ఐక్యరాజ్య సమితి ఖండన**

ఒకసారి ఆస్పత్రి, ఒకసారి స్కూలు, ఒకసారి శరరణార్థుల శిబిరం, మరోసారి సురక్షిత ప్రాంతం ఇలా ఎక్కడైనా ఎప్పుడైనా పాలస్తీనియన్లను లక్ష్యంగా చేసుకని ఇజ్రాయిల్ ఊచకోతలకు పాల్పడుతోందని ఐక్యరాజ్య సమితి ప్రత్యేక దూత, మానవ హక్కుల నిపుణులు ఫ్రాన్సెసా అల్బనీస్ విమర్శించారు. ఈ మేరకు ఆమె ఎక్స్‌లో పోస్టు పెట్టారు. పాలస్తీనా ప్రాంతాల్లో మానవ హక్కుల పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు ఐక్యరాజ్య సమితి ప్రత్యేకంగా ఆమెను నియమించింది. అమెరికా, యురోపియన్ యూనియన్ అందజేసిన ఆయుధాలను ఉపయోగించి ఇజ్రాయిల్ ఈ దాడులకు పాల్పడుతోందని అల్బనీస్ పేర్కొన్నారు. పాలస్తీనియన్లను కాపాడడంలో మనందరి వైఫల్యాన్ని వారు క్షమించాలని ఆమె వ్యాఖ్యానించారు.

## విద్యుదాఘాతంతో రైతు మృతి

ప్రజాశక్తి - ఆస్పరి (కర్నూలు జిల్లా)

విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన కర్నూలు జిల్లా ఆస్పరి మండలంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బిల్లేకల్లు గ్రామానికి చెందిన గొల్ల మల్లయ్య (49) తాను సాగుచేస్తున్న పత్తి పొలంలో గుంటక పాస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగ తగిలి అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న సిఐ మస్తాన్ వలీ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. పొలంలో ఉన్న మృతదేహాన్ని ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతునికి భార్య జయమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ మస్తాన్ వలీ తెలిపారు.

## ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థులు మృతి

ప్రజాశక్తి-పామూరు (ప్రకాశం జిల్లా)

ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థులు మృత్యువాత పడిన ఘటన ప్రకాశం జిల్లా పామూరు పట్టణం డివిపాలెం వద్ద శనివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు..డివి పాలెం నుంచి వెంకటాపురం వెళ్లే కాలిబాట వద్ద హైవే రోడ్డు కోసం మట్టి గుంతలు తీశారు. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లో నీళ్లు చేరాయి.

స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు పసుపులేటి చరణ్ (17), పసుపులేటి గౌతమ్ (18) ఈ గుంతల్లో ఈత ఆడేందుకు వెళ్లారు. లోతు తెలియకపోవడంతో ఇద్దరూ చిక్కుకుపోయారు. బయటకు రాలేక, ఊపిరాడక మరణించారు. ఘటనాస్థలాన్ని సిఐ శ్రీరాంనాయక్, ఎస్సై సైదుబాబు పరిశీలించారు. గజ ఈతగాళ్ల సహాయంతో మృతదేహాలను బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం కనిగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

## ఇంజినీరింగు మూడో దశ కౌన్సెలింగ్ నిర్వహించాలి

- ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు ఇఎపిసెట్ మూడో దశ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె ప్రసన్నకుమార్, ఎ అశోక్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతియేటా మూడు విడతలు నిర్వహించే కౌన్సెలింగ్‌ను ఈసారి రెండు విడతాల్లోనే ముగించారని పేర్కొన్నారు.

కన్వీనర్ కోటాలో 1,39,254 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రెండు విడతల కౌన్సెలింగ్‌లో 1,20,303 భర్తీ అయ్యాయని, 18,951 సీట్లు భర్తీ కాలేదని వివరించారు. మొత్తం 1,86,740 మంది అభ్యర్థులు ఇఎపిసెట్‌లో అర్హత సాధించారని పేర్కొన్నారు. మూడో విడత కౌన్సెలింగ్ కోసం అర్హత సాధించిన విద్యార్థులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మూడో విడత సీట్ల భర్తీకి ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరారు.

**కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్**
40-5-19/17, 1వ అంతస్తు, సిద్ధార్థ కాలేజి బస్టాప్ దగ్గర, మొగల్‌రాజపురం, విజయవాడ-520010

**సవరణ**

ది. 10-08-2024 న ఈ దినపత్రికలో ప్రచురితమైన కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్, విజయవాడ బ్రాంచి కి చెందిన ప్రకటన లో 'డిమాండ్ నోటీస్' అని ప్రచురించడమైనది. దానికి బదులుగా "స్థిరాస్తి అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన" గా చదువుకోగలరు. మిగతా వివరములలో ఎలాంటి మార్పు లేదు.

అధీకృత అధికారి

**CHANGE OF NAME**

I, Neelam Munnilal Jain (old name) Resident of D.No.11-21-15, First Floor, Poolabhavi Street, One Town, Vijayawada, NTR District,Andhra Pradesh-520001. My Name has been changed to Neelam Jain (New name) .Hereafter my name is known as Neelam Jain.

HDFC BANK We understand your world
**హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్**
40-5-4ఎ, 3వ అంతస్తు, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ హౌస్, టిక్కిల్ రోడ్, విజయవాడ-520010.

లాంఛనప్రాయ స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

(ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 యొక్క రూల్ 8(1)తో చదువబడే అనుబంధం-4 ప్రకారం) ఏదైతే, క్రింది సంతకందారు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, ...

| | 13(2) నోటీసు తేదీ | నోటీసు మొత్తాలు |
|---|---|---|
| | 23/04/2023 | Rs. 14,54,292/- |

తేది: 07.08.2024
ప్రదేశం: విజయవాడ

అధీకృత అధికారి, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్

# సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి : హోం మంత్రి

- అవగాహన, ఫిర్యాదుల కోసం ప్రత్యేక యాప్
- విజయవాడలో వాక్‌థాన్, మానవహారం

ప్రజాశక్తి - విజయవాడ, విజయవాడ అర్బన్

సైబర్ నేరాల నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర హోం శాఖ మంత్రి వి.అనిత అన్నారు. ఇందుకుగాను ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. సైబర్ నేరాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు శనివారం విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి బెంజిసర్కిల్ వరకు పోలీసుశాఖ ఆధ్వర్యాన వాక్‌థాన్ నిర్వహించారు. అనంతరం బెంజిసర్కిల్ వద్ద మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హోం మంత్రి హాజరయ్యారు. 16 రకాల సైబర్ మోసాలపై అవగాహన, ఫిర్యాదుల కోసం రూపొందించిన యాప్‌ను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం ప్రజలకు ఉపయోగపడాలే కానీ పక్కదారి పట్టి ప్రజల మనుగడకే ప్రమాదంగా మారే పరిస్థితి రాకూడదన్నారు. కేవలం నాలుగు నెలల్లోనే దేశవ్యాప్తంగా రూ.1730 కోట్లను సైబర్ నేరగాళ్లు దోచుకున్నారని, దేశంలో 24 శాతం వరకు ఈ నేరాలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. లోన్‌యాప్, హనీ ట్రాప్‌లో పడి పలువురు ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారన్నారు.

నిత్య జీవితంలో వినియోగించే అనేక యాప్‌ల ద్వారా మోసాలు జరుగుతున్నాయని వివరించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర స్థాయిలో సైబర్ సోల్జర్లను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి జిల్లాలోనూ సైబర్ సెల్ చురుగ్గా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహనరావు, బొండా ఉమామహేశ్వర రావు, ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన, జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖరబాబు, డిసిపి గౌతమి షాలి తదితరులు పాల్గొన్నారు.



వాక్‌థాన్‌లో పాల్గొన్న మంత్రి అనిత, గద్దె రామమోహనరావు, కలెక్టర్ సృజన, సిపి రాజశేఖరబాబు తదితరులు

# ఆందోళనకరంగా చక్కెర పరిశ్రమ

- గగ్గోలు పెడుతున్న చెరకు రైతులు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలో చక్కెర పరిశ్రమల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఉన్న పరిశ్రమల్లో అనేకం మూతపడగా, మిగిలిన వాటిల్లో కూడా ఉత్పత్తి ఆశాజనకంగా కనిపించడం లేదు. చెరకు క్రషింగ్ పడిపోతుండగా, చెరకు నుంచి వచ్చే చక్కెర శాతం కూడా తగ్గుతోంది. చెరకు రైతులకు సరైన ప్రోత్సాహం లభించకపోవడం, చెరకులో నాణ్యత తగ్గిపోతుండడం వల్లనే ఈ పరిస్థితి నెలకొంటోందని అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో మొత్తం 29 చక్కెర కర్మాగారాలు ఉన్నాయి. వాటిల్లో సహకార రంగంలో 10, ప్రయివేటు రంగంలో 19 పరిశ్రమలు ఉన్నాయి. అయితే వాటిల్లో కేవలం ఐదు మాత్రమే పనిచేస్తున్నాయి. సహకార రంగంలో ఒకటి, ప్రయివేటు రంగంలోవి నాలుగు పనిచేస్తున్నాయి. సహకార రంగంలో చోడవరం కర్మాగారం మాత్రమే పనిచేస్తుండడం గమనార్హం. మిగిలినవి నష్టాల కారణంగా మనుగడలో లేవని అధికారులు చెబుతున్నారు. పనిచేస్తున్న వాటిల్లో కూడా గతేడాది కన్నా 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

2022-23 సంవత్సరంలో ఐదు కర్మాగారాల ద్వారా 22.42 లక్షల మెట్రిక్ టన్నుల చెరకును క్రష్ చేయగా 2023-24లో మాత్రం కేవలం 18.91 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే క్రషింగ్ జరిగినట్లు లెక్కలు చెబుతున్నాయి. దీని ద్వారా అంతకుముందు సంవత్సరం 1.90 లక్షల మెట్రిక్ టన్నుల చక్కెర ఉత్పత్తికాగా, గతేడాది మాత్రం 1.59 లక్షల మెట్రిక్ టన్నుల చక్కెర మాత్రమే ఉత్పత్తి జరిగినట్లు తేలింది. ఇది మొత్తం చెరకు రికవరీలో 8.96 శాతంగానే ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. చెరకు పంటకు సరైన ప్రోత్సాహం లేకపోవడం వల్లనే ఉత్పత్తి తగ్గిపోతున్నట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**చక్కెర కర్మాగారాలు, ఉత్పత్తి పనిస్థితి (లక్షల మెట్రిక్ టన్నుల్లో)**

| విభాగం | 2022-23 | 2023-24 |
|---|---|---|
| మొత్తం పరిశ్రమలు | 29 | 29 |
| పనిచేస్తున్నవి | 5 | 5 |
| క్రష్‌చేసిన చెరకు | 22.42 | 18.91 |
| చక్కెర సాధన | 1.90 | 1.59 |
| రికవరీ శాతం | 9.32 | 8.96 |

## శ్రీశైలానికి తగ్గిన వరద ప్రవాహం

- పది గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

కృష్ణ ఎగువ పరివాహక ప్రాంతాల నుండి శ్రీశైలం జలాశయానికి నీటి ప్రవాహం తగ్గు ముఖం పట్టింది. శనివారం సాయంత్రం 6 గంటల సమయానికి ఎగువ జూరాల నుండి 1,84,786 క్యూసెక్కులు, తుంగభద్ర ద్వారా 17,916 క్యూసెక్కుల నీటితో కలిపి 2,02,702 క్యూసెక్కులు శ్రీశైలం జలాశయానికి చేరుతున్నాయి. శ్రీశైలం పది గేట్లను పది అడుగుల మేర ఎత్తి దిగువ నాగార్జునసాగర్‌కు 2,69,280 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయం నీటి మట్టం 885 అడుగులకు గాను ప్రస్తుతం 882.50 అడుగులకు చేరింది. నీటి నిల్వ సామర్థ్యం 215 టిఎంసిలకుగాను ప్రస్తుతం 201.588 టిఎంసిలుగా నమోదయింది. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుండి హంద్రీనీవా సుజల స్రవంతికి (ముచ్చుమర్రి)కి 1203 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు 25,000 క్యూసెక్కులు, మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 1020 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఎడమ గట్టు భూగర్భజల విద్యుత్తు కేంద్రంలో 37,540 క్యూసెక్కుల నీటితో 16.649 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తిని చేస్తున్నారు. 29,888 క్యూసెక్కుల నీటితో 15.215 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని చేస్తూ దిగువ సాగర్‌కు 67,428 క్యూసెక్కులు, పది గేట్లతో కలుపుకొని 2,36,708 క్యూసెక్కులన్నిటిని విడుదల చేస్తున్నారు.

## అల్ట్రాటెక్ లైమ్‌స్టోన్ గనులకు 5స్టార్ రేటింగ్

హైదరాబాద్ : తమ పన్నెండు అల్ట్రాటెక్ లైమ్‌స్టోన్ గనులకు మైనింగ్ మంత్రిత్వశాఖకు చెందిన ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ నుంచి 5 స్టార్ రేటింగ్‌ను ఇచ్చిందని ఆ సంస్థ తెలిపింది. ఇందులో అనంతపురంలోని అల్ట్రాటెక్ లైమ్‌స్టోన్ గనికి స్థానం లభించిందని పేర్కొంది. దీనికి సంబంధించి ఇటీవల ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి నుంచి అవార్డును అందుకున్నట్లు పేర్కొంది.



# రచ్చకెక్కిన దువ్వాడ కుటుంబ వ్యవహారం

- ఎమ్మెల్సీ ఇంటి వద్ద భార్య, కుమార్తెల నిరసన
- వారిపై హత్యాయత్నం కేసు పెట్టిన శ్రీనివాస్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ కుటుంబ వ్యవహారం రచ్చకెక్కింది. ఎన్నికలకు ఏడాది ముందు కుటుంబంలో వివాదం నెలకొనడంతో వైసిపి పెద్దల సమక్షంలో పంచాయితీ జరిగింది. ఆస్తుల పంపకాలు, కూతుర్ల వివాహాలు, అప్పులు వంటి అంశాలపై ఇరువురి మధ్య ఒప్పందం కుదిరింది. అప్పట్నుంచి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, ఆయన భార్య వాణి వేర్వేరుగా ఉంటున్నారు. ఇద్దరు కుమార్తెలు తల్లితోనే ఉంటున్నారు. ఒప్పందంలో పేర్కొన్న ఆస్తుల పంపకం, ఇతర అంశాలు అమలు కాకపోవడంతో టెక్కలిలోని అక్కవరం వద్ద దువ్వాడ నూతన నివాసం వద్ద ఈ నెల ఎనిమిదో తేదీన ఆయన కుమార్తెలు నిరసనకు దిగడంతో మరోసారి కుటుంబ వ్యవహారం రచ్చకెక్కింది. ఆ రోజు సాయంత్రం 3.30 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఆందోళన చేశారు. ఆ మరుసటి రోజు దువ్వాడ వాణి తన కుమార్తెలతో కలిసి శ్రీనివాస్ ఇంటికి వెళ్లి నిరసన తెలిపారు. గేట్లు తొలగించుకుని ఇంట్లోకి ప్రవేశించేందుకు యత్నించగా భార్య, కూతళ్లపై శ్రీనివాస్ దాడికి ప్రయత్నించడంతో అప్పటికే అక్కడకు చేరుకున్న పోలీసులు ఆయనను అడ్డుకున్నారు. దీనిపై వాణి, ఆమె కుమార్తెతో పాటు ఐదుగురు వ్యక్తులు తనపై హత్యాయత్నానికి ప్రయత్నించారని టెక్కలి పోలీస్‌స్టేషన్‌లో శనివారం శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. తనను అరెస్టు చేయించేందుకు అధికార పార్టీతో కలిసి వాణి నాటకం ఆడుతోందని విమర్శించారు. దువ్వాడ శ్రీనివాస్ నివాసం వద్ద శనివారం కూడా వాణి నిరసనకు దిగారు. ఈ పరిణామాల నేపథ్యంలో వివాదానికి కారణమని ఆరోపణలు ఎదుర్కొంటున్న టెక్కలికి చెందిన దివ్వల మాధురి మీడియా ముందుకొచ్చారు. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కు, తనకు మధ్య ఉన్నది స్నేహ బంధమేనని అన్నారు. తనపై లేనిపోని నిందలు వేసి రోడ్డు మీదకు లాగడం సరికాదని, వాణిపై పరువునష్టం దావా వేస్తానని చెప్పారు. వాణి పిల్లలకు డిఎన్ఎ పరీక్ష చేయిస్తే, తన పిల్లలకూ చేయిస్తానని సవాల్ విసిరారు. రాజకీయ కాంక్షతోనే శ్రీనివాస్‌ను వాణి వేధిస్తోందని, ఆస్తుల కోసం ఇబ్బందులు పెడుతోందని ఆయన తల్లి లీలావతి ఆరోపించారు.

## 230 కిలోల గంజాయి స్వాధీనం

- తమిళనాడుకు చెందిన ఐదుగురు అరెస్టు

ప్రజాశక్తి- మంగళగిరి రూరల్ (గుంటూరు జిల్లా)

కాకినాడ జిల్లా తుని నుండి తమిళనాడుకు రెండు కార్లలో 230 కిలోల గంజాయిని తరలిస్తుండగా గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కాజ టోల్‌గేట్ వద్ద స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) అధికారులు శుక్రవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడుకు చెందిన ఐదుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుండి రెండు కార్లు, 6 సెల్ ఫోన్లు, రూ.34 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వివరాలను మంగళగిరిలోని సెబ్ కార్యాలయంలో గుంటూరు జిల్లా సెబ్ అడిషనల్ ఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు శనివారం మీడియాకు వెల్లడించారు. మాదక ద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో కాజా టోల్‌గేట్ వద్ద తనిఖీలు చేపట్టగా గంజాయి పట్టుబడిందని, దీని విలువ రూ.30 లక్షలు ఉంటుందని చెప్పారు. రెండు కార్లలో గంజాయిని అక్రమంగా తరలిస్తున్న తమిళనాడు రాష్ట్రం పూడుకొట్టాయి అర్నాతాంగికి చెందిన మమ్మద్ అమీర్, కైలాయి ముద్దాన్, షేక్ అబ్దులా, కార్తీకేయాన్, ఎస్.మల్లికార్జునను అరెస్టు చేశామని తెలిపారు. సమావేశంలో జిల్లా సెబ్ అడిషనల్ ఎస్‌పి ఎల్.రంగారెడ్డి, స్టేట్ టాస్క్‌ఫోర్స్ సిఐ ఎ.అనంద్, మంగళగిరి సెబ్ సిఐ పి.ప్రసన్నలక్ష్మి, ఎస్ఐ రాజేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

## 'మీకు తెలుసా'

- ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం : ఎపి శాక్స్ పిడి సిరి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

హెచ్ఐవి, లైంగికంగా సంక్రమించే అంటువ్యాధుల గురించిన సమాచారాన్ని అందించడంతో పాటు ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు రెండు నెలల పాటు నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (నాకో) నేతృత్వంలో 'మీకు తెలుసా' రాష్ట్ర స్థాయి 'ఇంటెన్సిఫైడ్ ఐఇసి క్యాంపెయిన్'ను ఈ నెల 12న విజయవాడలో ప్రారంభించనున్నట్లు ఎపి శాక్స్ పిడి ఎ సిరి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని దేశ వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 12న ఉదయం ఎనిమిది గంటలకు సిద్ధార్థ ఆర్ట్స్ కాలేజీ నుంచి భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో విద్యావేత్తలు, మేధావులు, కమ్యూనిటీ చాంపియన్లు, విద్యార్థులు పాల్గొనాలన్నారు. జనాభాలో హెచ్ఐవి, సుఖ వ్యాధుల గురించి పరిజ్ఞానం, అవగాహన పెంపొందించడానికి, సురక్షిత పద్ధతులు పాటించడానికి, హెచ్ఐవి ఉన్నవారి పట్ల వివక్ష తగ్గించడంతోపాటు ప్రజల్లో అవగాహన కలిగించి, హెచ్ఐవి పరీక్షలు ఎక్కువ మంది చేయించుకునేందుకు జిల్లాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

## సిస్కోలో వేలాది ఉద్యోగులపై వేటు

న్యూయార్క్ : అమెరికాకు చెందిన టెక్ దిగ్గజం సిస్కోలో వేలాది మంది ఉద్యోగులు రోడ్డున పడనున్నారు. మాంద్యం భయాలతో ఇటీవల టెక్నాలజీ కంపెనీల సిబ్బందిపై వేటు వేస్తున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి రెండో వారంలో దాదాపు 4,000 మందికి ఉద్వాసన పలికిన సిస్కో.. మరోమారు భారీగా సిబ్బందిని తొలగించే ప్రక్రియలో ఉందని రిపోర్టులు వస్తున్నాయి. ఆరు నెలలు కూడా కాకముందే మళ్లీ ఉద్వాసనల సంకేతాలు ఆ సంస్థ ఉద్యోగులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోన్నాయి. వ్యాపారంలో డిమాండ్ తగ్గడం, సరఫరా చైన్‌లో సమస్యల కారణంగానే కంపెనీ ఇలాంటి నిర్ణయాలను తీసుకుంటోందని తెలుస్తోంది. సిస్కోలో ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 85వేల మంది ఉద్యోగులు పని చేస్తోన్నారని అంచనా.

సైబర్ సెక్యూరిటీ, ఎఐ రంగాల వైపు దృష్టి సారించింది. 2025 నాటికి ఎఐ ఉత్పత్తుల ఆర్డర్‌లో బిలియన్‌కు చేరుకోవాలనే లక్ష్యంలో భాగంగా ఉద్యోగులను తగ్గించుకొనేందుకు ప్రయత్నాలు ప్రారంభించిందని తెలుస్తోంది.

## బజాజ్ ఫైనాన్స్ రూ.341 కోట్ల జిఎస్‌టి ఎగవేత..!

న్యూఢిల్లీ : బజాజ్ ఫైనాన్స్ రూ.341 కోట్ల జిఎస్‌టిని ఎగవేసిందని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ ఇంటెలిజెన్స్ (డిజిజిఐ) తెలిపింది. దీనికి సంబంధించిన ఆగస్టు 3న పన్ను ఎగవేత నోటీసులను జారీ చేసినట్లు వెల్లడించింది. కంపెనీకి మొత్తం 160 పేజీల నోటీసు పంపింది. మినహాయింపు ప్రయోజనాలను పొందేందుకు బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ సర్వీస్ లేదా ప్రాసెసింగ్ ఛార్జీలను వడ్డీగా పరిగణించడం ద్వారా జిఎస్‌టిని ఎగవేస్తోందని డిజిజిఐ తెలిపింది. ఈ అంశంలో రూ. 341 కోట్ల పన్ను ఎగవేత, రూ.150 కోట్ల వడ్డీ సహా జరిమానా కలుపుకుంటే మొత్తంగా రూ.850 కోట్ల జరిమానా చెల్లించాల్సి ఉందని తెలుస్తోంది.

## 12న నామినేషన్

- మాజీ మంత్రి బొత్స

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

ఉమ్మడి విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు వైసిపి అభ్యర్థిగా ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఈ నెల 12న సోమవారం విశాఖ కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేయనున్నారు. విశాఖ మేఘాలయ హోటల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఈ విషయాన్ని ఆయన వెల్లడించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి భారీ మెజారిటీతో విజయం సాధిస్తుందని, అందులో ఎవరికి ఎటువంటి సందేహమూ అవసరం లేదన్నారు. పలువురు మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులను బొత్సను కలిసి తాజా పరిణామాలపై చర్చించారు.

HINDUJA HOUSING FINANCE
**హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్**
నమోదిత కార్యాలయం: 167-169, 2వ అంతస్తు, లిటిల్ మౌంట్, సాయిదాపేట, చెన్నై-600015, తమిళనాడు, ఇండియా. రీజినల్ కార్యాలయం: డో.నం.54-20-10/1ఎ, 3వ అంతస్తు, గురునానక్ కాలనీ మెయిన్ రోడ్డు, ఎస్‌బిఐ బ్యాంక్ ఎదురు, విజయవాడ, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్-520008. www.hindujahousingfinance.com

సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్స్ 8(5) మరియు 9(1) క్రింద రుణగ్రహీతకు స్థిరాస్తుల అమ్మకం నోటీసు.

తేది: 10-08-2024

...

మీ విధేయులు,
హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్., తరపున
(అధీకృత అధికారి)

HINDUJA HOUSING FINANCE
**హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్**
నమోదిత కార్యాలయం: 167-169, 2వ అంతస్తు, లిటిల్ మౌంట్, సాయిదాపేట, చెన్నై-600015, తమిళనాడు, ఇండియా. రీజినల్ కార్యాలయం: డో.నం.54-20-10/1ఎ, 3వ అంతస్తు, గురునానక్ కాలనీ మెయిన్ రోడ్డు, ఎస్‌బిఐ బ్యాంక్ ఎదురు, విజయవాడ, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్-520008. www.hindujahousingfinance.com

సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్స్ 8(5) మరియు 9(1) క్రింద రుణగ్రహీతకు స్థిరాస్తుల అమ్మకం నోటీసు.

తేది: 10-08-2024

...

**స్థిరాస్తి (సెక్యూర్డ్ అసెట్) వివరణ :**
గుంటూరు జిల్లా, చిలకలూరిపేట ఎస్.ఆర్.ఓ. పరధిలోని చిలకలూరిపేట మున్సిపాలిటీ, పసుమర్రు గ్రామం వద్ద ఉన్న డో.నం.790/జె3బి1ఎ లో మూల్యాంకనం నం.1020023951, బేరింగ్ డో.నం.31-253/6బి, ఆ స్థలం మొత్తం మరియు ఆర్.సి.సి. భవనంతో స్థలం లో నిర్మించబడిన గ్రౌండ్ ఫ్లోర్ విస్తీర్ణం 175.12 చ.గ.లు. మరియు క్రింది విధమైన హద్దులు : తూర్పు : కార్యనిర్వాహకుల ఆస్తి (తన్నీరు శ్రీనివాసరావు), దక్షిణం : బజారు, పడమర : షేక్. మహబూబ్‌కు చెందిన ఆస్తి, ఉత్తరం : ఎస్.కోటేశ్వరరావుకు చ ఎందిన సైట్.

మీ విధేయులు,
హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్., తరపున
(అధీకృత అధికారి)

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate A Government of India Undertaking
**గవర్నర్‌పేట బ్రాంచ్ (0680)**
గవర్నర్‌పేట, విజయవాడ-520002, ఆంధ్రప్రదేశ్.
0866-244452, 8331015679

**స్థిరాస్తులు అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన**

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002 లోని 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన కెనరా బ్యాంక్, గవర్నర్‌పేట బ్రాంచ్ వారికి ఋణగ్రహీత(లు): **శ్రీమతి సంకు మణి, భర్త: తిరుమల నాయుడు మరియు శ్రీ సంకు గోవర్ధన నాయుడు, తండ్రి: సంకు తిరుమల నాయుడు** గార్లు తేది 31.07.2024 నాటికి చెల్లించవలిసిన బకాయి **రూ.22,71,167/- (ఇరవై రెండు లక్షల డబ్బై ఒక్క వేల నూట అరవై ఏడు రూపాయలు)** + వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమును రాబట్టుకొనుటకు **కెనరా బ్యాంక్, గవర్నర్‌పేట బ్రాంచ్** అధీకృత అధికారిచే భౌతిక స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన దిగువ వివరించిన స్థిరాస్తిని తేది **30-08-2024** న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని ప్రజానీకానికి మరియు ముఖ్యంగా పైన తెలిపిన ఋణగ్రహీత & హామీదారులకు తెలియజేయడమైనది.

**ఇ-వేలం తేది & సమయం: 30-08-2024, ఉ॥ 10.30 గం.లకు**
రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును ఆర్.టి.జి.ఎస్ / నెఫ్ట్ / ఫండ్ ట్రాన్స్‌ఫర్ ద్వారా కెనరా బ్యాంక్, గవర్నర్‌పేట బ్రాంచ్ RTGS/NEFT GL A/c No: 209272434, IFSC Code: CNRB0000680 వారికి తేది: 28.08.2024, సా॥ 5.00 గం.ల లోపుగా చెల్లించవలెను.

ఒకవేళ ఎన్‌కంబ్రెన్స్‌లు ఏమైనా ఉన్నచో వాటితో కలిపి స్థిరాస్తి వివరములు:

షెడ్యూల్-ఎ: కృష్ణా జిల్లా, గుణదల సబ్-రిజిస్ట్రీ, విజయవాడ రూరల్, ప్రసాదంపాడు, సమీప డోర్ నెం. 6-6/195, ఆర్. ఎస్ నెం. 85/1 నందు 242 చ॥గ॥లలో అవిభాజ్యపు వాటా స్థలం 20.16 చ॥గ॥లు. **హద్దులు:** తూర్పు: వెలిశల సాంబశివరావు యొక్క ఆస్తి, దక్షిణం: బోయపాటి విజయకుమార్ ఆస్తి, పడమర: 20 అ॥ వెడల్పు రోడ్డు, ఉత్తరం: బోయపాటి కిషోర్ బాబు ఇతరులకు అమ్మిన ఆస్తి. షెడ్యూలు-బి: ఐటమ్ నెం. 1 స్థలం నందు నిర్మించిన "శ్రీ పావని రెసిడెన్సీ", 3వ అంతస్తులో 708 చ॥అ॥ ప్లింత్ ఏరియా (కామన్ ఏరియా కలుపుకొని) మరియు 20 చ॥అ॥ టూ వీలర్ పార్కింగ్ ఏరియా కలిగిన ఫ్లాట్ నెం. టి.ఎఫ్-1. **హద్దులు:** తూర్పు: మెట్లు మరియు ఉమ్మడి వరండా, దక్షిణం: శూన్యాకాశం, పడమర: శూన్యాకాశం, ఉత్తరం: శూన్యాకాశం

రిజర్వు ధర: రూ. 20,00,000/- | ధరావత్తు సొమ్ము: రూ. 2,00,000/-

www.canarabank.com ... https://www.bankeauctions.com ...

తేది: 08.08.2024, ప్రదేశం: విజయవాడ
సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

సంపాదకీయం

# 'వైఫ్ ఆఫ్' కాదు..!

'పెళ్లికి ముందు ఎంతో చలాకీగా, ఉత్సాహంగా, చదువు, తెలివితేటలు ఉన్న అమ్మాయి పెళ్ళవగానే ఇంటి బాధ్యతతో తానేమిటో, తన పేరేమిటో కూడా మర్చిపోతుంది. పిల్లలు 'అమ్మ' అని, పనిమనిషి 'ఆఫీసురు గారి భార్య' అని, భర్త 'ఏమేవ్' అని, తల్లిదండ్రులు 'అమ్మాయ్' అని చెప్తారు. తన పేరు తెలుసుకోవాలనే ప్రయత్నంలో చిన్ననాటి స్నేహితురాలు ఎదురై... తన పేరుతో పిలుస్తుంది. అప్పటివరకూ అసలు తన అస్తిత్వాన్ని కూడా మర్చిపోతుంది. తర్వాత పాత పెట్టె తీసి తన సర్టిఫికెట్స్, బహుమతులు, బొమ్మలు అన్నీ పిల్లలకి, భర్తకి గర్వంగా చూపుతుంది'. ఆడపిల్లకి పెళ్ళవగానే కుటుంబం, భర్త, పిల్లలు తప్ప తన గురించిన ధ్యాసే ఉండకూడదు. వుంటేగింటే...'వైఫ్ ఆఫ్' గానే ఉండిపోవాలన్న ఆధిపత్య భావజాలానికి అనుగుణంగా స్త్రీని ఇంటికే పరిమితం చేసిన తీరుని వ్యంగ్యంగా చెప్తారు 'ఇల్లలకగానే పండగౌనా' కథలో ప్రముఖ రచయిత్రి పి.సత్యవతి. తన గురించి తాను తెలుసుకునే క్రమంలో ఎంతో చైతన్యశీలిగా మారింది స్త్రీ. తరతరాలుగా వంట యింటికే అతుక్కుపోయి, వండి వారుస్తూ... పిల్లల్నికనే యంత్రంగా గడిపిన యాంత్రిక జీవనం గతకాలపు స్త్రీది. కానీ, నేటి స్త్రీ మారుతున్న కాలానికనుగుణంగా తనూ మారుతూ.. స్పందిస్తూ... తన గొంతు సవరించుకుంది. తన స్థానం వంటిల్లేకాదు... అంతరిక్షం వరకూ తనకసాధ్యమైనది లేదని నిరూపించుకుంటోంది. తరతరాలుగా సాగించిన అణచివేత నుంచి ఒక ధిక్కారస్వరాన్ని వినిపించింది.

ఎంత చదువుకున్నా, ఎంత ఉన్నతమైన పదవిలో వున్నా... పలానావారి కూతురనో, భార్య అనో చెప్తారే తప్ప, తనకంటూ ఒక అస్తిత్వం, గుర్తింపు వున్నాయనే విషయాన్ని తొక్కిపెట్టేస్తారు. అందుకే అంటాడు చలం... 'స్త్రీకి కూడా శరీరం ఉంది. దానికి వ్యాయామం ఇవ్వాలి. ఆమెకు మెదడు ఉంది దానికి జ్ఞానం ఇవ్వాలి. ఆమెకు హృదయం ఉంది దానికి అనుభవం కావాలి' అని. అధిపత్య భావజాలం అడుగడుగునా వ్యక్తమౌతున్న బిజెపి ప్రభుత్వంలో రాజ్యసభ సాక్షిగా జయాబచ్చన్ ధిక్కారస్వరాన్ని వినిపించారు. 'పేరులో ఏముంది? అంటారుగానీ... ఒక్కోసారి ఆ పేరు పిలిచేతీరు, పలికే తీరులోని వ్యంగ్యం, ఆ స్వరంలోని తీవ్రతను బట్టి... ఇచ్చే గౌరవాన్ని అంచనా వేయొచ్చు. మరీ ముఖ్యంగా కళారంగంలో వున్న జయాబచ్చన్ వంటి వారు, ఎదుటివారి పిలుపులోని గౌరవాన్ని, వ్యంగ్యాన్ని సులభంగానే అర్థం చేసుకోగలరు. రాజ్యసభలో చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ 'జయా అమితాబ్ బచ్చన్' అని వ్యంగ్యంగా, తీవ్ర స్వరంతో పిలవడమేగాక... తన భర్త పేరుతోగాక, తన పేరుతో సంభోదించాలని కోరినా... వితండవాదం చేయడంతో... పలువురు మహిళా ఎంపీలు తమ గొంతును వినిపించారు. తమ అస్తిత్వాన్ని గుర్తించాలని డిమాండ్ చేశారు. నిరసనగా ప్రతిపక్ష సభ్యులు వాకౌట్ చేశారు. అయినా, మనువాద భావజాలాన్ని అణువణువునా జీర్ణించుకున్న ధన్‌ఖడ్... అధికార ఆధిపత్యంతో బెదిరింపు ధోరణి ప్రదర్శించారు.

భారతీయ సంస్కృతి గురించి వాగాడంబరం ప్రదర్శించేవారు... వారు అమలు పరిచే మనుస్మృతి చెప్పిన 'యత్ర నార్యస్తు పూజ్యన్తే రమన్తే తత్ర దేవతా' అన్న సూక్తిని కూడా తమకు అనుకూలంగా మార్చేసుకుంటున్నారు. స్త్రీలకు కనీస హక్కులు లేవు, అనుకున్నది చేసే స్వేచ్ఛలేదు. నచ్చిన బట్టలు కట్టుకునే హక్కులేదు. ఆర్థిక స్వాతంత్య్రం, అధికారం అసలే లేదు. కానీ, నేటి ఆధునిక స్త్రీ ఈ అవాంతరాలన్నీ దాటుకుంటూ వస్తోంది. సాధికారత దిశగా పయనిస్తోంది. 'ఆధునిక స్త్రీ చరిత్రను పునర్లిఖిస్తుంది' అంటారు మహాకవి గురజాడ. కేవలం 'వైఫ్ ఆఫ్' కాదు... మై సెల్ఫ్ అంటూ ఆత్మ విశ్వాసం ప్రకటిస్తోంది. దాని ప్రతిరూపమే పార్లమెంటులో ప్రతిధ్వనిస్తోన్న మహిళా గళం. ఈ కలలకొక రూపు ఏర్పడి, అవి ఫలిస్తున్న దశలో వేరుపురుగులు కొన్ని ఆధిపత్యశక్తులు ఆటంకపరుస్తున్నాయి. 'సంకెళ్లను ఇంకెన్నాళ్లు మోస్తావ్/ నిన్ను నువ్వే పక్షి రెక్కలా నిమురుకుని ఎగిరేసుకోవాలి/ కుంగినప్పుడల్లా ఆకాశాన్ని నిగడదన్ను' అంటారో కవయిత్రి. స్త్రీలలో ఎంతోకాలంగా అణగారివున్న ఆలోచనలు, ఆవేదనలు వారిలో చేతనా జ్వాలలు రగిలించగల దివిటీలు. ఇవి వారిలోని అజ్ఞాత విజ్ఞాన శక్తులను ప్రబుద్ధం చేస్తుంది. తమ గళాలకు మరింత పదును పెడుతుంది.


మహనీయుల మాట



**పెట్టుబడిదారీ మార్గం నిజానికి ఒక వినాశకరమైన మార్గమని తేలిపోయింది. మార్పుకు అది అనుమతించదు.**
**- హ్యూగో చావెజ్**

విశ్లేషణ

# వర్గీకరణ సమస్య



బి.వి. రాఘవులు

సుప్రీం కోర్టు తీర్పు వర్గీకరణ సమస్యపై మరోసారి వాదోపవాదాలకు తెరతీసింది. వర్గీకరణ రాజ్యాంగబద్ధమేనని, రాష్ట్రాలు నిర్ణయం తీసుకోవడానికి రాజ్యాంగం అడ్డు కాదని కోర్టు మెజారిటీ తీర్పునిచ్చింది. ఏడుగురి ధర్మాసనంలో ఒక్కరు మాత్రమే ఈ అభిప్రాయంతో విబేధించారు. ఈ సందర్భంలోనే ధర్మాసనంలోని నలుగురు న్యాయమూర్తులు 'క్రీమీ లేయర్'ను కూడా ప్రవేశ పెట్టడం మంచిదని విడివిడి తీర్పుల్లో పేర్కొన్నారు. ప్రధాన న్యాయమూర్తి, మరొకరు మాత్రం ఈ విషయంపై మౌనం వహించారు. మొత్తంమీద సుప్రీంకోర్టు తీర్పు వర్గీకరణకు వ్యతిరేకంగా లేవనెత్తబడిన రాజ్యాంగపరమైన అభ్యంతరాలపై స్పష్టమైన తీర్పునిచ్చింది. వర్గీకరణ చెయ్యాలా? వద్దా? అన్న నిర్ణయాన్ని రాష్ట్రాలకు వదిలివేసింది. కోర్టుకు వచ్చిన వ్యాజ్యం రాష్ట్రాలకు సంబంధించిన విషయం అయినప్పటికీ తీర్పు కేంద్రానికి కూడా వర్తిస్తుంది.

గతంలో కొన్ని రాష్ట్రాలలో వర్గీకరణ సమస్య ముందుకొచ్చినప్పుడు సిపియం వర్గీకరణను సమర్థించింది. ఎస్సీల్లోనే వివిధ ఉపకులాల మధ్య విద్యా, ఉద్యోగాలలో కొట్టొచ్చినట్లు వ్యత్యాసాలు వున్నాయని అధ్యయన కమిటీలు స్పష్టమైన వివరాలు/ డేటాపై ఆధారపడి సమర్పించిన నివేదికల ఆధారంగా నిర్ధారించినప్పుడు సిపియం వర్గీకరణకు సానుకూలత ప్రకటించింది.

**తీర్పు నేపథ్యం-కొన్ని అంశాలు**

పంజాబ్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు తమ రాష్ట్ర పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని గతంలో ఎస్సీ తరగతిలో వర్గీకరణ చెయ్యడానికి నిర్ణయాలు తీసుకున్నాయి. ఒక్క తమిళనాడులో తప్ప, మిగిలిన అన్ని రాష్ట్రాల్లో కోర్టు తీర్పుల మూలంగా ఈ నిర్ణయాలు అమలులోకి రాలేదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వర్గీకరణపై తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ వచ్చిన వాజ్యంపై వర్గీకరణ రాజ్యాంగబద్ధం కాదని సుప్రీం కోర్టు 2005లో తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాలు చేస్తూ వచ్చిన అనేక పిటిషన్లన్నింటిని కలిపి విచారించిన ఏడుగురు సభ్యుల ధర్మాసనం 2024 ఆగష్టు 1వ తేదీన తన తీర్పును వెలువరించింది. తీర్పులో వివాదాస్పదంగా మారిన కొన్ని ముఖ్యాంశాలను పరిశీలిద్దాం.

రాజ్యాంగంలో 341 అధికరణం రాష్ట్రాలు ఎస్సీ వర్గీకరణ చేయడానికి అనుమతించదన్న వాదనను కోర్టు తిరస్కరించింది. ఎస్సీ, ఎస్టీ జాబితాలపై నిర్ణయించే హక్కు పార్లమెంటుదై నందున వర్గీకరణ అంశం కూడా పార్లమెంటు పరిధిలోనిదని, ఇందులో రాష్ట్రాల జోక్యానికి తావు లేదన్న వాదనను తిరస్కరిస్తూ, తమ పరిస్థితులను బట్టి రాష్ట్రాలు నిర్ణయం తీసుకోవచ్చునని స్పష్టం చేసింది. వర్గీకరణ చేసే హక్కు పార్లమెంటుదా, రాష్ట్రాలదా అనే అంశంకన్నా, అసలు వర్గీకరణ చెయ్యడం అవసరమా లేదా అన్నది ముఖ్యం. ఈ అంశంపై స్పష్టత వస్తే ఎక్కడి నుండి ప్రారంభించడం బాగుంటుందన్న అంశం కేవలం సాంకేతిక, ఆచరణాత్మక సమస్య అవుతుంది.

వర్గీకరణ చట్టబద్ధమా కాదా అన్న అంశాన్నే కాకుండా సమానత్వం సాధించడం అన్న కోణంలో కూడా వర్గీకరణ సమంజసమేనని కోర్టు అభిప్రాయపడింది. ఎస్సీ తరగతి అస్పృశ్యత 'అంటరానితనం' గురయ్యే కులాల బృందంగా ఏర్పడినందున అది ఒక 'ఏకఖండ' (హోమోజీనియస్) బృందం, అందువలన దాన్ని విడదీయడం సమంజసం కాదన్న వాదనను కోర్టు తిరస్కరించింది. అస్పృశ్యతకు ఎస్సీ తరగతిలో ఉన్న ఉపకులాన్ని గురవుతున్నా వాటి మధ్య అన్ని విషయాలలో ఏకరూపత లేదు. సామాజిక, ఆర్థిక, విద్యా విషయాలలో వ్యత్యాసం వుందని, హెటిరోజీనియస్ బృందమని కోర్టు భావించింది. ఈ వ్యత్యాసాలను అధిగమించడానికి వర్గీకరణ సమంజసమేనని కోర్టు చెప్పింది.

**విమర్శలు-ఆక్షేపణలు**

ఈ అంశంపై కోర్టు సరైన సమాచారం/ డేటా లేకుండానే నిర్ధారణ చేసిందని ఆక్షేపణలు వచ్చాయి. ఈ విమర్శలో పసలేదు. ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు నియమించిన అధ్యయన కమిషన్ల రిపోర్టులు అంతర్గతంగా ఎస్సీ ఉప కులాల మధ్య వున్న వ్యత్యాసాలను బహిర్గతం చేశాయి. 2011 జనరల్ సెన్సెస్‌లో ఎస్సీ ఉపకులాలపై ఉన్న సమాచారాన్ని పరిశీలించినా వ్యత్యాసాలపై నిర్ద్వంద్వమైన సమాచారం దొరుకుతుంది. కొంత మంది వ్యత్యాసాలున్నాయని అంగీకరిస్తూనే, ఎస్సీలలో వెనకబడిన ఉపకులాలు, ముందంజలో ఉన్న కులాలతో పోటీ పడగల స్థాయికి రావడానికి అవసరమైన ప్రత్యేక సదుపాయాలను అదనంగా కేంద్రం, రాష్ట్రాలు కల్పిస్తే సరిపోతుందని వర్గీకరణ అవసరం లేదని అంటున్నారు. ఈ సూచనలో అభ్యంతరం పెట్టాల్సిందేమీ లేదు కానీ ఇది వర్గీకరణకు ప్రత్యామ్నాయం కాదు. దానికి జత చేయాల్సింది మాత్రమే. వర్గీకరణ అనేది రిజర్వేషన్ హక్కులో భాగంగా వుంటుంది. వర్గీకరణ వలన లాభం ఏ కొద్దిపాటిదైనా, తక్షణం అందుబాటులోకి వస్తుంది. సదుపాయాలు ప్రభుత్వాల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి వుంటాయి.

'వర్గీకరణ' రిజర్వేషన్ల వ్యవస్థను ఉనికిలోకి తెచ్చిన మౌలిక భావనకు భంగం కల్గిస్తుందని గతం నుండి వస్తున్న విమర్శ. ఇప్పుడు కోర్టు ఇచ్చిన తీర్పుపై కూడా వస్తున్నది. అణచివేత, అస్పృశ్యత వంటి సామాజిక అంశాలు రిజర్వేషన్ల వ్యవస్థ ఉనికికి ప్రాతిపదిక అని ఇప్పుడు కోర్టు వెనకబాటుతనం, తగ్గిన ప్రాతినిధ్యం వంటి అంశాలను ప్రవేశపెట్టి రిజర్వేషన్‌కున్న ప్రాతిపదికను బలహీనం చేస్తున్నదని ఈ విమర్శ సారాంశం.



> **ఎస్సీ, ఎస్టీలకు క్రీమీ లేయర్ వుండకూడదని సిపియం అభిప్రాయం. చారిత్రకంగా ఎటువంటి ఆస్తిపాస్తులు కల్గివుండడానికి నోచుకోని ఎస్సీలలో ఇప్పటికీ స్థిరమైన ఆస్తిపాస్తులు కల్గిన స్పష్టమైన ఒక తరగతి ఏర్పడలేదు. కొద్దిమంది రాజకీయ నాయకులను, ఐఏఎస్, ఐపిఎస్ అధికారులను, కొద్ది మంది పరిశ్రమల యజమానుల పేర్లను చూపించి క్రీమీ లేయర్‌ను ప్రతిపాదించడం న్యాయం కాదు. ఈ కుటుంబాల చేతిలో తగినంత సంపద పోగుబడిందని, వారి సామాజిక హోదా పెరిగిందని, అటువంటి కుటుంబాల సంఖ్య తగినంత మోతాదులో వుందని మాట వరసకు అంగీకరించినా వాటి సంపద, సామాజిక హోదా తర్వాతి తరాలకు పాస్‌ఆన్ అవుతుందన్న పరిస్థితి లేదు. అటువంటప్పుడు ఎస్సీ తరగతిలో క్రీమీ లేయర్ గురించి ఇప్పుడు చర్చించడం అసందర్భం.**

ఈ విమర్శకు తగిన ప్రాతిపదిక వుందని అనుకోలేం. ఎస్సీలలో అంతర్గత వ్యత్యాసాలను అధిగమించేందుకు ముందుకు వచ్చిన అంశాన్ని రిజర్వేషన్ల మౌలిక భావనకు వ్యతిరేకం అని భావించడానికి ఆస్కారం లేదు. మన దేశంలో రిజర్వేషన్ల చారిత్రక నేపథ్యం, అస్పృశ్యత లేని తరగతులకు కూడా రాజ్యాంగం రిజర్వేషన్లు కల్పించిన తీరును పరిశీలిస్తే, రిజర్వేషన్లను, ప్రాతినిధ్యాలకు ఏదో ఒక్క అంశం ప్రాతిపదికగా వున్నది అనుకోవడం సాధ్యం కాదు. సామాజిక అణచివేత, అస్పృశ్యతలను నేరాలుగా రాజ్యాంగం ప్రకటించింది. వాటిని ఎదుర్కోవడానికి ప్రభుత్వాలు చట్టాలు కూడా తెచ్చాయి. అవి అధ్వాన్నంగా అమలు చేయబడుతున్నాయనేది వేరే విషయం. అయితే సామాజిక బలహీనత అధిగమించడానికి చట్టాలే సరిపోవని, విద్య, ఆర్థిక, రాజకీయ సాధికారతలను కూడా ఇవ్వడం అవసరమని భావించే, విద్య, ఉపాధి, రాజకీయ రంగాలలో రిజర్వేషన్లు కల్పించబడ్డాయి.

**జనరల్ కోటాకు మళ్లింపు-బ్యాక్‌లాగ్ విధానం**

వర్గీకరణ మూలంగా నిండని ఖాళీల సంఖ్య పెరుగుతుందని, వాటిని జనరల్ కోటాలోకి మళ్ళించడం ద్వారా ఎస్సీలకు అన్యాయం జరుగుతుందని కొందరు ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. నిండని ఖాళీలను జనరల్ కోటాలోకి మార్చాలన్న ప్రయత్నం వర్గీకరణ అంశంతో ముడిపెట్టడం సరికాదు. జనరల్ కోటాలోకి మార్చాలనే ప్రయత్నాలు వర్గీకరణ అంశం చర్చకు రాకముందు నుండి జరుగుతున్నాయి. వీటికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాల మూలంగానే 'బ్యాక్‌లాగ్' అన్న పద్ధతి ప్రవేశ పెట్టబడింది. అయినా ఇప్పటికీ ఇటువంటి ప్రయత్నాలు జరుగుతూనే వున్నాయి. ఈమధ్య యుజిసి రిజర్వుడ్ ఖాళీలను జనరల్ కోటాలోకి ఎటువంటి పరిస్థితుల్లో మార్చవచ్చో వివరిస్తూ మార్గదర్శక సూత్రాలను ప్రతిపాదించింది. తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం కావడంతో హడావుడిగా ఉపసంహరించుకుంది. ఇటువంటి ప్రయత్నాలను అడ్డుకోవడం తప్ప ఈ అంశాన్ని వర్గీకరణతో ముడిపెట్టడం తప్పు. అలాగే వర్గీకరణ అనేది ఎస్సీ తరగతి అంతర్గత అంశం: ఉన్న కోటాలో ఉప విభజన. అందువలన ఒక బృందంగా చూసినప్పుడు ఎస్సీ తరగతిగా నష్టపోయేది వుండదు. ఒక ఉపతరగతిలో ఖాళీ మిగిలిపోతే ఇంకో తరగతిలో అర్హులైన వారితో నింపవచ్చు. అన్ని ఉప తరగతుల నుండి కూడా భర్తీ కాకపోతే బ్యాక్‌లాగ్‌లో పెట్టవచ్చు. ఈ పద్ధతి వలన కోటా ఎస్సీ తరగతి దాటి బయటకు పోవడం వుండదు. రాష్ట్రాలు గానీ కేంద్రంగానీ వర్గీకరణ తీసుకువస్తే ఎస్సీ కోటా బయటకు పోకుండా రాజ్యాంగ, చట్టబద్ధమైన ఏర్పాటు చేసేట్లుగా చూడాలి.

**అభివృద్ధిలో వ్యత్యాసాలు-పరిష్కార మార్గాలు**

వర్గీకరణకు మరికొన్ని అభ్యంతరాలు కూడా వస్తున్నాయి. వర్గీకరణ దళితుల ఐక్యతను విచ్ఛిన్నం చేస్తుందని వీటిలో ఒకటి. వాస్తవం ఏమంటే ఎస్సీల్లోని వివిధ ఉపకులాల మధ్య పెరుగుతున్న వ్యత్యాసాలే వర్గీకరణ డిమాండ్‌కు దారితీశాయి. వ్యత్యాసాలను అధిగమించే చర్యలను సమర్థించడమే ఐక్యతకు మార్గం తప్ప, వాటిని వ్యతిరేకించడం కాదు. దీని ద్వారా వ్యత్యాసాల పేరుతో అనైక్యతను సృష్టించేవారి ఆటలు కట్టించడం సులభం.

అలాగే బూర్జువా రాజకీయ పార్టీలు వర్గీకరణ అంశాన్ని తమ స్వార్థపూరిత ప్రయోజనాలకు ఉపయోగించు కొంటున్నాయనేది మరో విమర్శ. ఓట్ల కోసం ఒక సామాజిక తరగతిని ఇంకొక సామాజిక తరగతికి వ్యతిరేకంగా రెచ్చగొట్టడం, సమీకరించడం బూర్జువా పార్టీలు ఒక శాస్త్రంగా మార్చివేశాయనేది నిజం. ఈ కుటిల ప్రక్రియ ప్రయోగంలో బిజెపి అన్నిటికన్నా ముందున్నది. ఎస్సీల మధ్య ఉన్న అభివృద్ధి వ్యత్యాసాలను గుర్తించి, పరిష్కార మార్గాలను కనుగొనడం ద్వారా మాత్రమే బూర్జువా పార్టీల అనైక్యత సృష్టించే ఎత్తుగడలను తిప్పికొట్టగలం.

**వర్గీకరణ సర్వరోగ నివారిణి కాదు**

సుప్రీం కోర్టు వర్గీకరణకు అనుకూలంగా తీర్పిచ్చింది కాబట్టి ఇక ఎస్సీల్లోని వెనకబడిన ఉపకులాల సమస్యలన్నిటికి పరిష్కారం దొరికి పోయిందని ఎవరైనా భావిస్తే వారికి నిరాశే ఎదురవుతుంది.

అలా చూస్తే రిజర్వేషన్లే సామాజిక అణచివేతను, దళితుల వెనకబాటు పరిస్థితిని పరిష్కరించలేదు. సరళీకరణ విధానాలొచ్చిన తర్వాత (బూర్జువా పార్టీలన్నీ వీటిని అమలు చేస్తున్నాయి) రిజర్వేషన్లు ఇంకా నామమాత్రం అవుతున్నాయి. ఈ స్థితిలో వర్గీకరణ పెద్ద మార్పు సాధిస్తుందని అనుకోరాదు. ఎస్సీలలోని కొన్ని తరగతులలో అసంతృప్తి కారణమవుతున్న ఒక అంశానికి తక్షణ పరిష్కారం చూపించడం ద్వారా ఐక్యతను పెంపొందించడం జరిగితే, అదే మనం ఆశించగల పెద్ద లాభం.

అసలైన పరిష్కారం వెనకబాటుకు కారణమైన మౌలిక అంశాలను పరిష్కరించడంలో ఉంది. ఇప్పటికీ దళితులను అట్టడుగు స్థాయికి కట్టిపడవేస్తున్న భూసంబంధాలను బద్దలుకొట్టాలి. భూపంపిణీ జరగాలి. నాణ్యమైన విద్య, వైద్యం, ఉద్యోగం, ఆహారం, ఆవాసం హక్కులుగా మారాలి. ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు రావాలి. వీటిని సాధించుకుంటేనే దళితులకు, ఇతర బలహీన వర్గాలకు రిజర్వేషన్ల పరిమితులను దాటి తమ వెనకబాటుతనాన్ని అధిగమించేందుకు సత్తా వస్తుంది.


**క్రీమీ లేయర్ అవసరం లేదు**

సుప్రీం కోర్టు తను పరిష్కరించాల్సిన 'వర్గీకరణ' వివాదంపై తీర్పు చెబుతూనే 'క్రీమీ లేయర్'పై కూడా వ్యాఖ్యలను చేసింది. నలుగురు న్యాయమూర్తులు 'క్రీమీ లేయర్'ను ఎస్సీ, ఎస్టీలకు కూడా అనువర్తింప చేయాలని అభిప్రాయపడ్డారు. ఇది అమలు చేయాల్సిన తీర్పులో భాగం కాకపోయినా, వివాదాస్పద అంశం. ఎస్సీ, ఎస్టీలకు క్రీమీ లేయర్ వుండకూడదని సిపియం అభిప్రాయం. చారిత్రకంగా ఎటువంటి ఆస్తిపాస్తులు కల్గివుండడానికి నోచుకోని ఎస్సీలలో ఇప్పటికీ స్థిరమైన ఆస్తిపాస్తులు కల్గిన స్పష్టమైన ఒక తరగతి ఏర్పడలేదు. కొద్దిమంది రాజకీయ నాయకులను, ఐఏఎస్, ఐపిఎస్ అధికారులను, కొద్ది మంది పరిశ్రమల యజమానుల పేర్లను చూపించి క్రీమీ లేయర్‌ను ప్రతిపాదించడం న్యాయం కాదు. ఈ కుటుంబాల చేతిలో తగినంత సంపద పోగుబడిందని, వారి సామాజిక హోదా పెరిగిందని, అటువంటి కుటుంబాల సంఖ్య తగినంత మోతాదులో వుందని మాట వరసకు అంగీకరించినా వాటి సంపద, సామాజిక హోదా తర్వాతి తరాలకు పాస్‌ఆన్ అవుతుందన్న పరిస్థితి లేదు. అటువంటప్పుడు ఎస్సీ తరగతిలో క్రీమీ లేయర్ గురించి ఇప్పుడు చర్చించడం అసందర్భం.

*/ వ్యాసకర్త సిపియం పొలిట్‌బ్యూరో సభ్యులు /*

నివాళి

# నిబద్ధ నేత, నిరాడంబర జీవి బుద్ధదేవ్



తెలకపల్లి రవి

బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, సిపిఐఎం అగ్ర నాయకుడు బుద్ధదేవ్ భట్టాచార్యకు వంగదేశం అరుణాంజలితో అశ్రునివాళి అర్పించింది. ప్రగతిశీల రాజకీయాలు, ప్రజాస్వామిక విలువలు కోరుకునేవారందరికీ ఆయన మృతి విచారం కలిగించింది. రాజకీయ విభేదాలకు అతీతంగా ఆయనకు నేతలు నివాళులర్పించారు. అంతిమ యాత్రలో ప్రజలు పాల్గొన్న తీరు, ఎక్కడికక్కడ సామాన్యుల నుంచి కీలక నేతల దాకా ఆయనతో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్న తీరు తన పట్ల ఎంతటి గౌరవాభిమానాలున్నదీ విదితం చేసింది. రాజకీయాల్లో విలువలు కనుమరుగవుతున్న ఈ తరుణంలో బుద్ధదేవ్ భట్టాచార్య తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో కనబరిచిన నిబద్ధత, నిరాడంబరత్వం, నిష్కపటత్వం వంటి విశిష్టతలను ఉదాహరణలతో సహా ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. దేశంలో కీలకమైన బెంగాల్ వంటి పెద్ద రాష్ట్రానికి పదకొండేళ్లు ముఖ్యమంత్రిగా వున్నా సాదాసీదా అపార్ట్‌మెంట్‌లోనే ఆఖరి దాకా జీవితం గడిపిన ఆదర్శం ఆయనది.

**యువ నేతగా ఆరంభం**

కమ్యూనిస్టు ఉద్యమం సృష్టించిన త్యాగధనులలో మూడవ తరానికి చెందిన బుద్ధదేవ్ ప్రెసిడెన్సీ కాలేజీలో సాహిత్యం చదువుకుని విద్యార్థి సంఘాల ద్వారా 1966లో ఉద్యమంలో ప్రవేశించారు. ప్రమోద్ దాస్ గుప్తా తీర్చిదిద్దిన నాటి యువ బృందంలో బిమన్ బసు, సుభాష్ చక్రవర్తి, శ్యామల్ చక్రవర్తి, బుద్ధదేవ్ భట్టాచార్య, దినేష్ మజుందార్, అనిల్ బిశ్వాస్ వంటి వారు ముఖ్యులు. వారిలో ఇప్పుడు ఒక్క బిమన్ బసు మన మధ్య వున్నారు. 1970లలో బెంగాల్‌లో అర్ధ ఫాసిస్టు బీభత్సకాండను, హత్యాకాండనూ తట్టుకుని నిలిచిన యువ నాయకత్వం అది. దేశానికి 1975లో ఎమర్జన్సీ వస్తే బెంగాల్‌లో అయిదేళ్ల ముందు నుంచే ఈ బీభత్సకాండ తాండవించింది. సిపిఎం కార్యకర్తలు 1200 మంది బలికాగా వేలాది మంది ఇళ్లు వదలి ఎక్కడో తలదాచుకోవలసిన పరిస్థితి. అరాచకం తాండవించిన కాలమది. ఆ సమయంలో మొత్తం ఉద్యమ శ్రేణులు చెదరని స్థయిర్యంతో నిలబడటం వల్లనే దేశంలో, రాష్ట్రంలో కమ్యూనిస్టు ఉద్యమం కాపాడుకోవడం సాధ్యమైంది.

ఎమర్జన్సీ అనంతరం 1977 ఎన్నికలలో తొలిసారి ఘన విజయం సాధించిన వామపక్ష సంఘటన మంత్రివర్గంలో బుద్ధదేవ్ సమాచార సాంస్కృతిక మంత్రి అయ్యారు. 1982లో ఓడిపోయినా మళ్లీ 1987లో గెలిచి బాధ్యతలు చేపట్టారు. 1996లో జ్యోతిబసు అనారోగ్యం తర్వాత కీలకమైన హోంశాఖ బాధ్యతలు నిర్వహించారు. 1985 నుంచి సిపిఎం కేంద్ర కమిటీ తర్వాత పొలిట్‌బ్యూరో సభ్యుడుగా రాజకీయ నిర్ణయాలలో, సైద్ధాంతిక విధానాలలో ముఖ్య పాత్ర పోషించారు. యువ మంత్రిగా, డివైఎఫ్ఐ నాయకుడుగా ఆయన 1979లో వరంగల్‌లో ఉమ్మడి రాష్ట్ర తొలి మహాసభలకు రావడం తెలుగునాట నాటి యువ నేతలందరికీ జ్ఞాపకమే. పాతికేళ్ల తర్వాత 2005లో అదే వరంగల్‌లో సిపిఎం మహాసభలలో చేసిన కీలక ప్రసంగం, అప్పటికి గుజరాత్ ముఖ్యమంత్రిగా వున్న నరేంద్ర మోడీపై మత రాజకీయాలపై నిశిత విమర్శలుచేస్తే ఈ వ్యాసరచయిత అనువదించారు కూడా. "గుజరాత్‌లో జరిగిన మారణహోమానికి సాటి ముఖ్యమంత్రిగా నేను సిగ్గుపడుతున్నాను" అని బుద్ధదేవ్ తీవ్ర స్వరంతో అన్నారు. వ్యక్తిగత మర్యాదలు ఎలా వున్నా రాజకీయ సిద్ధాంత విషయాల్లో రాజీ పడని తత్వం ఇక్కడే మనకు స్పష్టమవుతుంది.

**విజయాలు, విచ్ఛిన్నాలు...**

23 ఏళ్ల ముఖ్యమంత్రిగా కొనసాగి దేశంలోనే కొత్త రికార్డు నెలకొల్పిన మహా నాయకుడు జ్యోతిబసు తర్వాత వామపక్ష కూటమి భవిష్యత్తు ఏదో అయిపోతుందని కొంతమంది రాజకీయ వ్యతిరేకులు కుత్సితంగా లేవనెత్తిన ప్రశ్నలకు సమర్థవంతమైన సమాధానంగా బుద్ధదేవ్ శక్తిని చాటారు. జ్యోతిబసు రాజకీయ పాలనా వారసత్వాన్ని జయప్రదంగా కొనసాగించారు. కమ్యూనిస్టులకు సంబంధించినంత వరకూ నాయకులపై ఎంత గౌరవం వున్నా విధానాలు, నిర్మాణం ముఖ్యమనే సత్యాన్ని నిరూపించారు. ఆయన హయాంలో జరిగిన మూడు ఎన్నికల్లోనూ ఫ్రంట్ విజయ పరంపర కొనసాగింది. 2000 సంవత్సరంలో ప్రభుత్వ సారథ్యం చేపట్టిన బుద్ధదేవ్ నాయకత్వంలో 2006 ఎన్నికలలో 294కు 235 స్థానాలు రావడం సంచలనం సృష్టించింది. దానికన్నా ముందు 2004 లోక్‌సభ ఎన్నికలలోనూ 35 స్థానాలు వచ్చాయి. పార్లమెంటులో మొత్తం 60 స్థానాలతో 42 సీట్లతో సిపిఎం వామపక్షం పాత్ర, ప్రతిష్ట విశిష్ట స్థాయికి చేరాయి. కేంద్రంలో బిజెపి మత రాజకీయాలకు అడ్డు కట్ట వేశాయి. యుపిఎ కు నాయకత్వం వహిస్తున్న కాంగ్రెస్ ఆ రాజకీయ వాస్తవాలు తెలిసీ అవకాశవాద అణు ఒప్పందం చిచ్చు పెట్టకపోతే చరిత్ర మరోలా వుండేది.

> **రాజకీయాల్లో విలువలు కనుమరుగవుతున్న ఈ తరుణంలో బుద్ధదేవ్ భట్టాచార్య తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో కనబరిచిన నిబద్ధత, నిరాడంబరత్వం, నిష్కపటత్వం వంటి విశిష్టతలను ఉదాహరణలతో సహా ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. దేశంలో కీలకమైన బెంగాల్ వంటి పెద్ద రాష్ట్రానికి పదకొండేళ్లు ముఖ్యమంత్రిగా వున్నా సాదాసీదా అపార్ట్‌మెంట్‌లోనే ఆఖరి దాకా జీవితం గడిపిన ఆదర్శం ఆయనది.**


సరళీకరణ విధానాలను, భూ దోపిడీని వ్యతిరేకించినవే వామపక్షాలు కాగా ఆ ముద్రతో వాటిపైనే దాడి చేయడం పాలక వర్గాల వ్యూహమైంది. వామపక్ష ఫ్రంట్ టార్గెట్‌గా సింగూరు, నందిగ్రామ్ ఘటనలపై అదేపనిగా ప్రచారాలు జరిగాయి. కాంగ్రెస్, మమతా బెనర్జీ తృణమూల్ మహాజోత్ పేరిట వామపక్ష ప్రభుత్వాన్ని ఓడించడమే పరమార్థంగా వ్యవహరించాయి. వాటిలో కొన్ని తప్పొప్పులు లేవని కాదు గాని ప్రజలకు ఉపాధి పెంచాలన్నదే బుద్ధదేవ్ ప్రభుత్వ సంకల్పం. ఆ పరిణామాలపై చాలా సమీక్షలే జరిగాయి. అనేక అధికారిక నివేదికలు, తీర్పులు కూడా వచ్చాయి. ఇప్పుడు వాటిని సాకల్యంగా చూస్తే ఎవరికైనా పూర్తి నిజాలు తెలుస్తాయి.

బెంగాల్ ముఖ్యమంత్రిగా బుద్ధదేవ్ భట్టాచార్య పెట్టుబడిదారీ సంస్కరణల కోసం ప్రయత్నించారనీ విఫలమైనారనీ శీర్షికలు వచ్చాయి. అప్పటికి పదేళ్ల సరళీకరణ విధానాల అమలు నేపథ్యంలో నూతన సహస్రాబ్ది తొలి పాదంలో అధికారం చేపట్టిన ఒక ప్రత్యామ్నాయ ప్రజా ప్రభుత్వం ముందు ఎలాంటి సవాళ్లు వుంటాయనే వాస్తవికత లేని ప్రతికూల వ్యాఖ్యలవి, ఒకవైపున మతతత్వ రాజకీయాలు పెరుగుతున్న దశ. కేంద్రం సహకార నిరాకరణ, కార్పొరేట్ శక్తుల ప్రతికూలత, అపారిశ్రామికీకరణ (డీ ఇండస్ట్రియలైజేషన్) నుంచి బెంగాల్‌ను ఎలా కాపాడుకోవాలనే సవాలు. ఆ క్రమంలో నూతన పారిశ్రామిక విధానం వచ్చింది. వాటిలో తప్పొప్పులు వుండొచ్చు గాని పారిశ్రామికీకరణ ఉద్యోగ కల్పన లక్ష్యంలో తప్పు లేదు. తొలి దశలో పాలక వర్గాల బడా మీడియా బుద్ధదేవ్ దార్శనికుడనీ, పిడివాదాన్ని వదిలేశాడని పైపైన పొగుడుతూనే ఆయన ప్రభుత్వం భూములు లాక్కొంటుందనే వ్యతిరేక ప్రచారాలు సాగించాయి. భూసంస్కరణలకు అమలులో అగ్రగామిగా నిలిచిన వామపక్ష కూటమి తదుపరి దశలో పారిశ్రామికీకరణ కోసం జరిపిన ప్రయత్నంలో కొన్ని పొరబాట్లున్న మాట నిజం, కానీ పాలక వర్గాలు, దారి తప్పిన కొన్ని శక్తులు పనిగట్టుకుని సాగించిన వ్యతిరేక ప్రచారాలే చాలా నష్టం చేశాయి. ఫలితమే 34 ఏళ్ల పాలన తర్వాత 2011లో వామపక్ష ఓటమి. వాటన్నిటినీ తట్టుకుని బుద్ధదేవ్ గట్టిగా నిలబడ్డారు. "నేను ఎక్కడ తప్పు చేశానా అని కొన్నిసార్లు ఆశ్చర్యం కలుగుతుంటుంది. భూ సేకరణే తప్పా లేక భూ సేకరణ జరిగిన విధానమా? నేను ప్రతిపక్షాలపై మరీ మెతగ్గా వ్యవహరించానా? ఆ అనుభవాల నుంచి మనం పాఠాలు తీసుకోవాలి." అని ఆయన ఆత్మకథలో చెప్పారు. ఫిర్ దేఖా, ఫిర్ దేఖా 2 (సింహావలోకనం లాంటిది) అనే ఆ రెండు సంపుటాల్లో జీవితాన్ని, రాజకీయ, పాలనానుభవాలను నెమరువేసుకున్నారు.

**ఆఖరు దాకా ఆదర్శంగా...**

వయో భారం, నిర్బంధాలు తట్టుకుంటూనే ఆరోగ్యం సహకరించినంత వరకూ సభలూ సమావేశాలలో పాల్గొంటూ తన పాత్ర నిర్వహిస్తూ వచ్చారు. 2011లో ఓడిపోయిన తన నియోజకవర్గం జాదవ్‌పూర్‌లో 2017లో పెద్ద మెజార్టీతో గెలిపించుకోగలిగారు. ఆయన భార్య మీరా భట్టాచార్య, కుమారుడు సుచేతన్ కూడా తోడుగా నిలిచారు. ఎంతటి కీలక బాధ్యతల్లో వున్నా బుద్ధదేవ్ ఎప్పుడూ సామాన్య జీవితమే గడిపారు. కార్యకర్తలతో కలసిపోయేవారు. గౌరవ మర్యాదలు పాటించినా మార్క్సిస్టు విలువలు, విధానాల విషయంలో రాజీ పడేవారూ కాదు. ఆయన నిరాడంబరత్వం, నిశిత దృష్టి గురించి సహచరులు ప్రత్యేకంగా చెప్పుకునేవారు. పటాటోపాలను ఏనాడూ దరి చేరనివ్వని ఆయన ఎవరు ఎంత చెప్పినా పామ్ అవెన్యూలోని తన నిరాడంబర నివాసం మార్చుకోవడానికి ఒప్పుకోలేదు. ఎప్పుడో ప్రభుత్వంలో వున్నప్పుడు వచ్చిన పాత అంబాసిడర్ కారునే ఆఖరు వరకూ ఆయన వాడేవారు. అందరితో స్నేహంగా గౌరవంగా వుండేవారు. అనారోగ్యంలో పరామర్శించే పేరుతో ముఖ్యమంత్రి మమత గానీ అప్పటి గవర్నర్ జగదీప్ ధంకర్ గానీ వంకర ప్రచారాలతో సిపిఎంపై బురదజల్లే ప్రయత్నం చేస్తే బుద్ధదేవ్ భట్టాచార్య, ఆయన భార్య చాలా గట్టిగా ఖండించేవారు. చివరి రోజుల్లో మోడీ ప్రభుత్వం పద్మభూషణ్ అవార్డు ప్రకటిస్తే తీసుకోవడానికి నిరాకరించారు. ఆఖరుకు ఆయన మరణానంతరం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు చేస్తామని ప్రకటించి తుపాకులతో వందనం సమర్పిస్తామంటే కూడా వారు నిరాకరించారు. బుద్ధదేవ్ వ్యక్తిత్వ వరవడి అలాంటిది.

కళా సాహిత్య రంగాల్లో బుద్ధదేవ్ భట్టాచార్య కృషి ప్రత్యేకమైంది. ఆయన రచయిత, కవి, నాటకకర్త కూడా. ఇన్ని రాజకీయాల సిద్ధాంత ఘర్షణల మధ్యనా టాగూర్ పద్యాలను 500 దాకా కంఠోపాఠంగా చెప్పేవారట. ఇరవయ్యవ శతాబ్దపు పెట్టుబడిదారీ విధానం గురించి "అది అత్యద్భుతమైన కాలం. అదే అత్యంత అధ్వాన్నమైన కాలం" అన్న డికెన్స్ మాటలను తన సంభాషణల్లోనూ ప్రసంగాల్లోనూ తరచూ ప్రస్తావించేవారు. సంక్లిష్ట సృజన శిల్పానికి పేరొందిన కాఫ్కా, మార్క్వెజ్ వంటి వారి రచనలను బెంగాలీలోకి అనువదించారు. సమాంతర చిత్రాలకు పేరెన్నికగన్న కోల్‌కతాలో నందన్ కానన్ కళాభవన్ పేరిట ఒక శాశ్వత వేదికను ఏర్పాటు చేయడానికి మంత్రిగా చొరవ తీసుకున్నారు. నామ్‌చామ్‌స్కీ వంటి మేధావులను, ప్రపంచ విప్లవకారులను కోల్‌కతాకు పిలిపించి గౌరవించడం, వారి భావాలు తెలుసుకోవడం జరిగేది. ప్రముఖ బెంగాలీ దర్శకులు, రచయితలతో లోతుగా చర్చలు చేసేవారు. ప్రసిద్ధ బెంగాలీ రచయిత సుకాంత భట్టాచార్య ఆయన బాబాయి. శ్రామికవర్గ ఉద్యమాలతో మమేకమై సిద్ధాంతాలను సృజనశీలతనూ మేళవించి అదే సమయంలో ఉద్యమ నిర్మాణంలోనూ పాలనా వ్యవహారాలలోనూ రాటుదేలిన బుద్ధదేవ్ జీవితం భావి తరాలకు ఓ పాఠం, ఆయనకిదే మరోసారి లాల్ సలామ్.



తెలకపల్లి రవి

# బెంగాల్‌లో ట్రైనీ డాక్టర్‌పై దారుణం

- అత్యాచారం, హత్య
- ఆత్మహత్యగా చిత్రీకరించే యత్నం
- జూడాల ఆందోళనలు

**కొల్‌కతా :** పశ్చిమ బెంగాల్‌లో మహిళా ట్రైనీ డాక్టర్ (31)పై అత్యాచారం చేసి, ఆపై దారుణంగా హత్య చేశారు. కోల్‌కతాలోని రాష్ట్ర ప్రభుత్వ నిర్వహణలో ఆర్‌జి కర్ ఆసుపత్రిలో గురువారం రాత్రి జరిగిన ఈ దారణం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. మహిళా డాక్టర్ అర్ధనగ్న మృతదేహాన్ని శుక్రవారం ఉదయం 11:30 గంటలకు వెలికి తీశారు. ఈ ఘటనను ఆత్యహత్యగా చిత్రీకరించేందుకు మమతా బెనర్జీ ప్రభుత్వం, అధికారులు ఎంతగా ప్రయత్నించినా పోస్టుమార్టంలో అన్ని విషయాలు వెల్లడయ్యాయి. దీంతో లాల్ బజార్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. యువతిని హత్య చేయడానికి ముందు, ఆమెపై అత్యాచారం జరిగిందని పోస్టుమార్టం ప్రాథమిక నివేదిక స్పష్టం చేసింది. యువతి ప్రైవేటు భాగాలతో సహా కళ్లు, నోరు, పెదవులు, వేళ్లు, ఎడమకాలు, కడుపు, కుడి చేయి వంటి 10 శరీరభాగాలపై గాయాలను పోస్టుమార్టంలో గుర్తించారు. ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం జరిగిందని తోటి వైద్యులు కూడా చెబుతున్నారు. శుక్రవారం సాయంత్రం రాష్ట్ర మహిళా కమిషన్ సుమోటోగా కేసు నమోదు చేసింది. ఈ ఘటన ఆసుపత్రిలో భద్రతపై అనేక ప్రశ్నలు లేవనెత్తుతోంది. సుమారు 36 గంటలు డ్యూటీలో ఉన్న వైద్యురాలు హత్యకు గురైన విషయాన్ని శుక్రవారం ఉదయం ఆమెను ఇంటికి తీసుకెళ్లడానికి వారి డ్రైవర్ ఆసుపత్రికి వచ్చే వరకూ ఎవరూ గుర్తించలేదు. ఒకటిన్నర రోజులు పని చేసిన తరువాత మహిళా డాక్టర్ ఇంటికి తిరిగివెళ్లాల్సి ఉంది. దీంతో ఆమె కోసం డ్రైవర్ వచ్చారు. ఆమె కోసం వెతికితే సెమినార్ హాల్‌లో ఉండవచ్చునని కొంత మంది చెప్పడంతో అక్కడ గాలించారు. అయినా ఆమె కనిపించలేదు. గురువారం రాత్రి ఆలస్యంగా ఆమె భోజనం చేశారని, చదువుకునేందుకు సెమినార్ హాల్‌కు వెళ్లారని, ఆ హాల్‌లోనే చివరిసారిగా చూశామని తోటి వైద్యులు చెబుతున్నారు. సెమినార్‌హాల్‌లో ఎలాంటి సిసి టివి లేదు. దీంతో ఘటన వివరాలను తెలుసుకోవడం కష్టంగా మారింది. మృతురాలు తన తల్లితో చివరిసారిగా గురువారం రాత్రి చివరిసారిగా ఫోన్‌లో మాట్లాడారు. ట్రైనీ డాక్టర్ దారుణ హత్యకు నిరసనగా జూనియర్ డాక్టర్ల నుంచి పోస్టు గ్రాడ్యుయేట్ డాక్టర్ల వరకూ సమ్మెకు పిలుపునిచ్చారు. సమ్మెతో ఆసుపత్రి వద్ద పరిస్థితి మరింత తీవ్రంగా మారింది. ఆసుపత్రి చట్టుపక్కల ఉన్న రోడ్లను పోలీసులు దిగ్బంధించారు. రోగులు, బంధువులు తీవ్ర అవస్థలు పడ్డారు.



ఆసుపత్రి ముందు ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు

### సివిక్ పోలీసు వాలంటీర్ అరెస్టు

ఈ కేసులో సివిక్ పోలీసు వాలంటీర్ సంజయ్‌దాస్‌ను శనివారం అరెస్టు చేశారు. డాక్టర్‌పై అత్యాచారం, హత్యకు పాల్పడింది ఆసుపత్రి ఉద్యోగి కాదని పోలీసులు చెబుతున్నారు. అరెస్టు చేసిన సంజయ్‌దాస్ 2019 నుంచి సివిక్ పోలీసు వాలంటీర్‌గా పనిచేస్తున్నాడని, ప్రస్తుతం పోలీసుల విభాగంలోని విపత్తు నివారణ విభాగంలో పనిచేస్తున్నాడని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలోనే రోగులను ఆసుపత్రిలో చేర్చడానికి తరచూ ఇక్కడకు వచ్చేవాడని చెప్పారు. గురువారం రాత్రి కూడా ఆసుపత్రిలో సంజయ్‌దాస్ సంచరించినట్లు పోలీసులు తెలిపారు. సంజయ్‌దాస్‌ను అరెస్టు చేసి సీలదాహ్ కోర్టులో ప్రవేశపెట్టగా జడ్జి 14 రోజుల కస్టడీ విధించారు.

### జూడాల పాదయాత్ర

ట్రైనీ డాక్టర్ హత్యకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నాయి. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఆర్‌జి కర్ మెడికల్ కాలేజీకి చెందిన జూనియర్ వైద్యులు శనివారం ఉదయం పాదయాత్ర నిర్వహించారు. బంకురా సమ్మిలానీ మెడికల్ కాలేజ్, బుర్ద్వాన్ మెడికల్ కాలేజీ, మేదినీపూర్ మెడికల్ కాలేజీ, నేషనల్ మెడికల్ కాలేజీ, శిశుమంగల్ ఆసుపత్రి వంటి పలు మెడికల్ కాలేజీల్లో జూనియర్ డాక్టర్లు సమ్మె చేస్తున్నారు.

ఈ ఘటనపై ముఖ్యమంత్రి బెనర్జీ స్పందిస్తూ 'దురదృష్టకరం, నీచమైనది' అని విమర్శించారు. తోటి డాక్టర్ల ఆగ్రహం న్యాయమైనదని అన్నారు. బాధితురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడాలని చెప్పారు. ఈ కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారిస్తారని తెలిపారు. దోషులకు కఠిన శిక్ష విధించే విధంగా చూస్తానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

### న్యాయం కోసం సిపిఎం ఆందోళన

అత్యాచారం, హత్యకు గురైన ట్రైనీ డాక్టర్ ఘటనలో న్యాయం చేయాలనే డిమాండ్‌తో ఆర్‌జి కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రి ముందు సిపిఎం శనివారం సాయంత్రం ఆందోళన నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ సలీం, పార్టీ నాయకులు కల్లోల్ మజుందర్, తరుణ్ బెనర్జీ, సుదీప్ సేన్‌గుప్తా, కనినిక గోష్ బోస్, ఫైయాజ్ అహ్మద్ ఖాన్ ఇతర నాయకులు పాల్గొన్నారు. ఈ ఆందోళన కార్యక్రమం తరువాత ఆసుపత్రి నుంచి శ్యామ్ బజార్ వరకూ మార్చ్ నిర్వహించారు. ఈ మార్చ్‌లో వందలాది మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, యువకులపై పోలీసులు చేసిన క్రూరమైన అణిచివేత, అరెస్టులను ఖండించారు.



## కేరళకు ఎఐకెఎస్ రూ.కోటి సాయం

- సిఎం పినరయి విజయన్‌కు అందజేత
- ఆల్ ఇండియా వయనాడ్ రిలీఫ్ ఫండ్‌కు ఎఐకెఎస్ పిలుపు

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

ఇటీవల కేరళలోని వయనాడ్‌లో కొండ చరియలు విరగడంతో జరిగిన విధ్వంసం నుంచి కోలుకునేందుకు అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్), కేరళ కర్షక సంఘం చేయూత అందించాయి. కోటి రూపాయలు సాయం అందించాయి. ఈ మేరకు తిరువనంతపురంలోని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను కలిసిన ఎఐకెఎస్, కేరళ కర్షక సంఘం నేతల బృందం రూ.కోటి చెక్కును అందజేశారు. వయనాడ్ కొండచరియల ఉపశమనం, పునరావాసం కోసం డిస్ట్రెస్ రిలీఫ్ ఫండ్‌ను అందించారు. అంతకుముందే ఎఐకెఎస్ రూ.5 లక్షలు ఇచ్చింది. ఆగస్టు 10న ఆల్ ఇండియా వయనాడ్ రిలీఫ్ ఫండ్‌కు పిలుపునిచ్చింది. అలాగే తమిళనాడు వివాసాయిగల్ సంఘం (ఎఐకెఎస్ అనుబంధం) కూడా వయనాడ్ రిలీఫ్ ఫండ్‌కు రూ.లక్ష విరాళంగా అందించింది. కేరళ కర్షక సంఘం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 27,000 కంటే ఎక్కువ ప్రాథమిక యూనిట్ల నుండి రూ.1 కోటి వసూలు చేసింది. ఈ సందర్భంగా ఎఐకెఎస్, కేరళ కర్షక సంఘం నేతల బృందం వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడటంతో జరిగిన విధ్వంసం ప్రదేశాలను సందర్శించింది. అక్కడి పరిస్థితులను స్థానికులను అడిగి తెలుసుకుంది. ఈ బృందంలో ఎఐకెఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ ధావలే, విజూ కృష్ణన్, ఉపాధ్యక్షులు ఇపి జయరాజన్, ఆర్థిక కార్యదర్శి పి కృష్ణప్రసాద్, కేరళ కర్షక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం విజయకుమార్, వల్సన్ పనోలి, ఉపాధ్యక్షులు ఎం మెహబూబ్, సంయుక్త కార్యదర్శి విఎస్ పద్మకుమార్, కోశాధికారి గోపి కొత్తమురికల్, సికెసి సభ్యుడు కెకె రఘేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్ఆర్ సకీనా, పి శశి, పిఎం ఇస్మాయిల్ తదితరులు ఉన్నారు.

## లేబర్ సెస్ నిధుల వినియోగంలో కేరళ టాప్

**తిరువనంతపురం :** దేశంలో లేబర్ సెస్ నిధులను పూర్తి స్థాయిలో వినియోగించిన రాష్ట్రంగా కేరళ రికార్డు సృష్టించింది. కార్మిక సంక్షేమ సెస్ కింద రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు రూ.1.12 లక్షల కోట్లు వసూలు చేయగా అందులో ఖర్చు చేసింది కేవలం రూ.64,000 కోట్లు మాత్రమే. 1996వ సంవత్సరపు బిల్డింగ్-ఇతర నిర్మాణ కార్మికుల చట్టం ప్రకారం రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు లేబర్ సెస్ నిధులను వసూలు చేస్తాయి. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం దీనిని ఖర్చు చేస్తారు. అందుకోసం రాష్ట్ర సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేస్తారు. ప్రమాదం జరిగినప్పుడు తక్షణమే ఆర్థిక సాయం అందించేందుకు, గ్రూప్ ఇన్సూరెన్స్ పథకాల కోసం చెల్లింపులు జరిపేందుకు, లబ్ధిదారులకు పెన్షన్ చెల్లింపులకు, ఇంటి నిర్మాణం కోసం లబ్ధిదారుడికి రుణాలు, అడ్వాన్సులు చెల్లించేందుకు, లబ్ధిదారుల పిల్లల చదువులకు ఆర్థిక సాయం అందించేందుకు, ప్రధాన వ్యాధుల బారిన పడిన వారికి వైద్య ఖర్చులు చెల్లించేందుకు, గర్భిణులుగా ఉన్న మహిళా లబ్ధిదారులకు వైద్య ఖర్చులు అందించేందుకు ఈ నిధులు వెచ్చిస్తారు. కేరళ మినహా ఏ రాష్ట్రం లేదా కేంద్ర పాలిత ప్రాంతం వంద శాతం నిధులను ఖర్చు చేయలేదు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కార్మిక, ఉపాధి కల్పన మంత్రిత్వ శాఖ అందజేసిన సమాచారం ఈ విషయన్ని నిర్ధారిస్తోంది. రాజ్యసభలో కర్నాటకకు చెందిన కాంగ్రెస్ సభ్యుడు జీసీ చంద్రశేఖర్ అడిగిన ప్రశ్నకు సంబంధిత శాఖ సహాయ మంత్రి శోభా కరండ్లజే సమాధానమిస్తూ వసూలైన సొమ్ములో రాష్ట్రాలు, యూటీలు రూ.48,137.19 కోట్లు ఖర్చు చేయలేదని తెలిపారు. పారిశ్రామిక రాష్ట్రమైన గుజరాత్‌లో రూ.5,549.46 కోట్లు వసూలు కాగా రూ.1,012.22 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని చెప్పారు. గుజరాత్‌తో పోలిస్తే కర్నాటక, మహారాష్ట్రలు కొంత ఎక్కువ నిధులను ఖర్చు చేశాయని వివరించారు. కేరళలో రూ.3,457.32 కోట్లు వసూలు కాగా అంతే మొత్తం ఖర్చయిందని అన్నారు.

## అనంతనాగ్‌లో ఎన్‌కౌంటర్

- ఇద్దరు సైనికులు మృతి

**జమ్మూ :** జమ్ము కాశ్మీర్‌లోని అనంతనాగ్‌లో తీవ్రవాదులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు సైనికులు మరణించగా, ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సైన్యం చేపట్టిన గాలింపు చర్యల సందర్భంగా దక్షిణ కాశ్మీర్ జిల్లాలోని కొకర్‌నాగ్ ఏరియాలో అటవీ ప్రాంతంలో ఈ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. ఇంటెలిజెన్స్ సమాచారం మేరకు, సైన్యం, జమ్ము కాశ్మీర్ పోలీసులు, కేంద్ర రిజర్వ్ పోలీసు బలగాలు (సిఆర్‌పిఎఫ్) కలిసి సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టాయి. అటవీ ప్రాంతాన్ని చుట్టుముట్టి భద్రతా బలగాలు గాలింపు చర్యలు చేపడు తుండగా, అడవుల్లో నక్కిన తీవ్రవాదులు ఒక్కసారిగా విచక్షణారహితంగా కాల్పులు జరిపారని అధికారులు తెలిపారు. ఇరు పక్షాల మధ్య కాల్పుల్లో ఐదుగురు సైనికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే ఆస్పత్రికి తరలించగా, ఇద్దరు మరణించారు. ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టిన బలగాలు గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. తీవ్రవాదుల కాల్పుల్లో ఇరువురు పౌరులు కూడా గాయపడ్డారని, వారికి వెంటనే వైద్య సాయం అందించామని ఆర్మీ తెలిపింది.

## హిమాచల్‌లో భారీ వర్షాలు

- 120కు పైగా రహదారులు మూసివేత

**సిమ్లా :** హిమాచల్‌ప్రదేశ్‌లో గత కొన్ని రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నెల 16వ తేదీ వరకూ రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ శనివారం హెచ్చరించింది. భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదలు సంభవించి రాష్ట్రంలో అనేక రహదారులు దెబ్బతిన్నాయి. దీంతో, 120కు పైగా రహదారులను మూసివేశారు. రాష్ట్రంలో శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం వరకూ నహన్‌లో అత్యధికంగా 168.3 మీమీ వర్షపాతం నమోదైంది. తరువాత స్థానాల్లో సంథోల్‌లో 106.4 మిల్లీమీటర్లు, నగ్రోత సురియాన్‌లో 93.2, ధౌలకౌన్‌లో 67, జెబ్బెర్హట్టిలో 53.2, కందఘాట్‌లో 45.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షాల కారణంగా అనేక ప్రాంతాల్లో విద్యుత్, మంచినీటి సరఫరాకు అంతరాయం కలుగుతోంది. భారీ వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నదులు, వాగుల సమీపంలోకి వెళ్లవద్దని అధికారులు సూచించారు.


సిమ్లాలో చెరువులను తలపిస్తున్న రహదారులు

## ఇరిగేషన్ ప్రాజెక్టులకు పాతపేర్లు పునరుద్ధరణ

- ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

రాష్ట్రంలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించి గత ఐదేళ్లలో మార్చిన పేర్లను తొలగించి అంతకుముందున్న పేర్లను పునరుద్ధరించారు. ఈ మేరకు జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. వరికిపూడిసెలతో కలిపి, వైఎస్ఆర్ పల్నాడు కరువు నివారణ ప్రాజెక్టు పేరును గతంలో ఉన్న గోదావరి పెన్నా అనుసంధాన ప్రాజెక్టు ఫేజ్-2గా మార్చారు. వైఎస్ఆర్ వేదాద్రి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు ముక్త్యాల లిఫ్ట్ ఇరిగేషన్ పథకం, వైఎస్ఆర్ వెలిగల్లు బ్రాంచ్ రిజర్వాయర్‌ను వెలిగల్లు రిజర్వాయర్, నారెడ్డి శివరామిరెడ్డి రిజర్వాయర్‌ను సర్వారాయసాగర్‌గా మార్చారు. నల్లపురెడ్డి శ్రీనివాసులురెడ్డి నెల్లూరు బ్యారేజీని నెల్లూరు బ్యారేజీగా, మేకపాటి గౌతంరెడ్డి సంగం బ్యారేజీని సంగం బ్యారేజీగా పేరును పునరుద్ధరించారు. గౌరిపాటి బుచ్చిఅప్పారావు తాటిపూడి రిజర్వాయర్‌ను తాటిపూడి రిజర్వాయర్‌గా, అనంతవెంకట్రామిరెడ్డి హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టును హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టుగా పేరును పునరుద్ధరించారు. వైఎస్ఆర్ అప్పర్ పెన్నార్ ప్రాజెక్టును పరిటాల రవీంద్ర లిఫ్ట్ ఇరిగేషన్ స్కీముగా మార్చారు. 2019-24 మధ్యలో ప్రారంభించిన మొగిలిగుండ్ల మినీ రిజర్వాయర్ పేరును బూచేపల్లి సుబ్బారెడ్డి మొగిలిగుండ్ల మినీ రిజర్వాయర్‌గా మార్చారు. ప్రస్తుతం దాన్ని మొగిలిగుండ్ల రిజర్వాయర్‌గా పేరు మార్చారు. అలాగే రాకెట్ల నారాయణరెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీము పేరును అంతకుముందున్న విధంగా రాకెట్ల అమిద్యాల లిఫ్ట్ ఇరిగేషన్ పథకంగా పేరు మార్చారు.

## ఎస్‌సి, ఎస్‌టి అధికారుల సంఘం ఎన్నిక

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

ఎస్‌సి, ఎస్‌టి అధికారుల సంఘం నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కె.వి.రమణ, ప్రధాన కార్యదర్శిగా ఎం.సునీల్‌కుమార్ ఎన్నికయ్యారు. వీరితోపాటు సహాయ అధ్యక్షులుగా హెచ్‌డి ఈరన్న, వర్కింగు ప్రెసిడెంట్‌గా బి.రత్నప్రసాదు, కోశాధికారిగా సిహెచ్.ఆనంద్ ఎన్నికయ్యారు. మహిళా విభాగం అధ్యక్షులుగా జె.సునీత, ఉపాధ్యక్షులుగా శివరాముడు, కె.అమలకుమారి, సంయుక్త కార్యదర్శులుగా రాయి రాంబాబు ఎన్నికయ్యారు. నూతన నాయకత్వాన్ని ఉద్యోగ సంఘాల నాయకులు అభినందించారు.

## ఖైదీ ముద్ర.. ప్రజాస్వామ్య సవాళ్లకు గుర్తు : హేమంత్‌సోరెన్

**రాంచీ :** జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్‌సోరెన్ శనివారం 49వ పుట్టినరోజును జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆయన గతేడాది జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా తన చేతిపై ఖైదీ ముద్ర ఉన్న ఓ ఫోటోను సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. 'ఈరోజు నా పుట్టినరోజు. గతేడాదికి చెందిన జ్ఞాపకాలు నన్ను వెంటాడుతున్నాయి. జైలు నుంచి రిలీజైన సమయంలో నా చేతిపై వేసిన ముద్ర.. ప్రజాస్వామ్య సవాళ్లకు గుర్తుగా ఉంటుంది. ఎన్నికైన సిఎంనే ఎటువంటి ఆధారాలు లేకుండా 150 రోజులపాటు జైలులో వేస్తే, ఇక సాధారణ ప్రజలు, గిరిజనులు, దళితుల పరిస్థితి ఎలా ఉంటుంది' అని ఆయన పోస్టులో ప్రశ్నించారు.



## బ్యాంకింగ్‌లో సంస్కరణలు

- డిపాజిట్లు.. రుణాల మధ్య అంతరం తగ్గాలి
- ఆకర్షణీయ పథకాలు పెట్టండి
- ఆర్‌బిఐ బోర్డు సమావేశంలో నిర్మలా సీతారామన్

**న్యూఢిల్లీ :** బ్యాంకింగ్ రంగంలో సంస్కరణలు చేపట్టాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కోరారు. తగ్గుతోన్న డిపాజిట్లపై ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఆకర్షణీయ, వినూత్న డిపాజిట్ పథకాలను ప్రవేశపెట్టాలని బ్యాంకర్లకు సూచించారు. ఆర్‌బిఐ ప్రధాన కార్యాలయంలో శనివారం జరిగిన బోర్డు సమావేశంలో మంత్రితోపాటు ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్, ఇతర బోర్డు డైరెక్టర్లు పాల్గొన్నారు. ఇందులో బడ్జెట్‌లోని అంశాలు, దేశంలోని ప్రస్తుత ఆర్థిక పరిస్థితులపై చర్చలు జరిగాయని సమాచారం. బోర్డు సమావేశం అనంతరం ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్‌తో కలిసి మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ప్రజల నుంచి డిపాజిట్లను ఆకర్షించడానికి వినూత్న ఉత్పత్తులను తీసుకురావాలన్నారు. డిపాజిట్లు, రుణాలు బండికి రెండు చక్రాల లాంటివని అభివర్ణించారు. డిపాజిట్లుగా వచ్చిన నిధులను అవసరమైన వారికి రుణాలుగా సమకూర్చాలన్నారు. అప్పుడే డిపాజిట్లకు, రుణాలకు మధ్య ఉన్న అంతరం తగ్గుతుందన్నారు. ఇందుకోసం వినూత్న, ఆకర్షణీయ డిపాజిట్ పథకాలు అవసరమన్నారు. బ్యాంకుల్లో వడ్డీ రేట్లు కూడా తక్కువగా ఉన్నాయని అన్నారు. అనేక ఏళ్లుగా కొనసాగుతున్న సమస్యకు పరిష్కారం చూపాలని మంత్రి బ్యాంకర్లకు సూచించారు.

### వడ్డీ రేట్లపై బ్యాంక్‌లదే నిర్ణయం

బ్యాంకింగ్ రంగంలో డిపాజిట్లు, రుణాలు అసమతుల్యత గురించి శక్తికాంత దాస్ ఆందోళన వ్యక్తం చేశారు. బ్యాంకులు సొంతంగా డిపాజిట్లను పెంచుకోవడానికి వడ్డీ రేట్లను నిర్ణయించుకునే స్వేచ్ఛను కల్పించామని పేర్కొన్నారు.

### నామినీ చట్టాల్లో మార్పులు..

చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న బ్యాంకింగ్ చట్టాల్లో సవరణలు చేస్తామని మంత్రి వెల్లడించారు. నామినీ చట్టాల్లో కూడా మార్పులు తీసుకురానున్నామన్నారు. ఈ మార్పుల ద్వారా బ్యాంకింగ్ వ్యవస్థ కస్టమర్ ఫ్రెండ్లీగా మారుతుందని చెప్పారు. బ్యాంక్‌లు అన్ క్లెయిమ్డ్ డిపాజిట్లపై దృష్టి సారించాలని సూచించారు.

రిజర్వు బ్యాంక్ వివరాల ప్రకారం.. 2024 మార్చి 31 నాటికి ఏడాది ప్రాతిపదికన బ్యాంకుల వద్ద ఎవరూ క్లెయిమ్ చేయని సొమ్ము 26 శాతం పెరిగి రూ.78,213 కోట్లకు చేరుకుంది. ఖాతాదారులు ఒక ఖాతాకు నలుగురు నామినీలను ఎంపిక చేసుకునేందుకు వెసులుబాటు కల్పించాలని బ్యాంకింగ్ చట్టాల సవరణ బిల్లు 2024 నిర్ణయించింది. దీనికి ముందు వరకు ఒక ఖాతాకు కేవలం ఒక నామినీని మాత్రమే ఖాతాదారులు ఎంపిక చేసుకునేందుకు అవకాశం ఉండేది. కొత్త చట్టాలు అమలులోకి వస్తే తదనుగుణంగా నామినీలను ఖాతాదారులు పెంచుకోవచ్చు. ఈ మార్పు ద్వారా సదరు ఖాతాదారులు మరణిస్తే డిపాజిట్లు లేదా ఇతర మొత్తాన్ని క్లెయిమ్ చేసుకోవటానికి చట్టపరంగా నామినీలకు అవకాశం కల్పించబడుతుంది. దాంతో భారీగా పెరుగుతున్న అన్ క్లెయిమ్డ్ డిపాజిట్లను భారీగా తగ్గించుకోవచ్చని యోచన.

## బంగ్లాదేశ్ చీఫ్ జస్టిస్ రాజీనామా

- విద్యార్థుల అల్టిమేటంతో నిర్ణయం

**ఢాకా :** బంగ్లాదేశ్ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ఒబైదుల్ హసన్ శనివారం రాజీనామా చేయడానికి నిర్ణయించుకున్నారు. ప్రధాని హసీనాను లక్ష్యంగా చేసుకుని ఆందోళనలు సాగించిన విద్యార్థి లోకం తాజాగా చీఫ్ జస్టిస్ వైదొలగాలంటూ నిరసనలు, అల్లర్లకు పాల్పడింది. శనివారంలోగా రాజీనామా చేయాలంటూ అల్టిమేటం జారీ చేశారు. దానికి తలొగ్గిన హసన్ రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. అధ్యక్షుడు మహ్మద్ షహబుద్దీన్‌తో సంప్రదించిన తర్వాత తన రాజీనామాను అందజేస్తానని చెప్పారు. కోర్టు ఆవరణలోకి విద్యార్థులు చొచ్చుకు వచ్చి నిరసనలకు పాల్పడడంతో మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో చీఫ్ జస్టిస్ తన నిర్ణయాన్ని వెల్లడించారు. రాజీనామా చేయకపోతే నివాసాలను ముట్టడిస్తామని ఆందోళనకారులు బెదిరించారని డైలీ స్టార్ వార్తాపత్రిక పేర్కొంది. అంతకుముందు సుప్రీంకోర్టు రెండు డివిజన్లకు సంబంధించిన న్యాయమూర్తులతో పూర్తిస్థాయి సమావేశాన్ని చీఫ్ జస్టిస్ ఏర్పాటు చేశారు. ఆ సమావేశాన్ని న్యాయవ్యవస్థ పన్నుతున్న కుట్రగా విద్యార్థులు ఆరోపించారు. హైకోర్టు ఆవరణను దిగ్బంధిస్తున్నట్లు ప్రకటించారు. దాంతో ఆ సమావేశాన్ని వాయిదా వేసుకున్న హసన్, రాజీనామా నిర్ణయాన్ని ప్రకటించారు. దేశవ్యాప్తంగా ఒక్కసారిగా తలెత్తిన పరిస్థితుల నేపథ్యంలో న్యాయమూర్తుల భద్రతను దృష్టిలో వుంచుకుని తాను రాజీనామా చేయాలని నిర్ణయించినట్లు హసన్ విలేకర్లకు చెప్పారు. ఇతర న్యాయమూర్తులు కూడా రాజీనామా చేస్తారా అని ప్రశ్నించగా అది వారి నిర్ణయమని వ్యాఖ్యానించారు. వందలాదిమంది విద్యార్థులు సుప్రీం కోర్టు ఆవరణలో గుమిగూడడంతో సైన్యం రంగంలోకి దిగింది. కోర్టు భవనాల వద్ద మోహరించింది. శాంతియుతంగా వ్యవహరించాలని, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయవద్దని సైన్యం కోరింది.


ఢాకాలో విద్యార్థుల ఆందోళన

### బంగ్లాదేశ్ బ్యాంక్ గవర్నర్ రాజీనామా

హసీనా దేశం వీడి వెళ్లిన ఈ నెల 5వ తేదీ నుండి బంగ్లాదేశ్ బ్యాంక్ గవర్నర్ అబ్దుర్ రవూఫ్ తాలుక్‌దర్ తన కార్యాలయంలో కనిపించలేదు. ప్రభుత్వం కుప్పకూలిన వెంటనే ఉన్నతాధికారులపై ఒత్తిళ్లు వచ్చిన నేపథ్యంలో ఆయన తన పదవికి శుక్రవారం రాజీనామా చేశారు. సెంట్రల్ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలోకి చొచ్చుకురావడంతో సహా తాజాగా జరిగిన అల్లర్లతో ఆయన ఈ చర్య తీసుకున్నారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేసినట్లు ఆయన ప్రకటించారు.

మైనారిటీలపై 205 దాడులు

ఈ నెల 5న హసీనా ప్రభుత్వం కుప్పకూలినప్పటి నుండి దేశవ్యాప్తంగా 52 జిల్లాల్లో మైనారిటీ కమ్యూనిటీలపై 205 దాడులు జరిగాయి. బంగ్లాదేశ్ హిందూ బుద్ధిస్ట్ క్రిస్టియన్ యూనిటీ కౌన్సిల్, బంగ్లాదేశ్ పూజా ఉడ్‌జపాన్ పరిషద్‌లు శుక్రవారం తాత్కాలిక ప్రభుత్వ అధినేత యూనస్‌కు బహిరంగ లేఖ రాస్తూ ఈ వివరాలు అందజేశాయి. తమ జీవితాలు ప్రమాదంలో పడినందున తాము రక్షణ కోరుతున్నామని వారు ఆ లేఖలో పేర్కొన్నారు. రాత్రుళ్లు మెలకువగా వుండి ఇళ్లు, గుళ్లు కాపాడుకోవాల్సి వస్తోందన్నారు. తక్షణమే దేశంలో మత సామరస్యతను పునరుద్ధరించాల్సి వుందని వారు డిమాండ్ చేశారు.

### అస్సాంలో బిఎస్ఎఫ్ హైఅలర్ట్

ప్రస్తుతం బంగ్లాదేశ్‌లోని సంక్షోభాన్ని దృష్టిలో వుంచుకుని అస్సాంలో ఇండో - బంగ్లాదేశ్ సరిహద్దు పొడవునా బిఎస్ఎఫ్ హై అలర్ట్‌ను ప్రకటించింది. సోమవారం నుండి ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టును మూసివేశామని, ఎగుమతి, దిగుమతులే కాకుండా ప్రజల రాకపోకలను నిలిపివేసినట్లు జిల్లా కమిషనర్ మృదుల్ యాదవ్ తెలిపారు.

## ప్రసూతి సెలవులతో కెరీర్‌కు అడ్డంకులు

- 'వాయిస్ ఆఫ్ ఉమెన్ స్టడీ'లో వెల్లడి

**న్యూఢిల్లీ :** ప్రసూతి సెలవుల తర్వాత చాలా మంది తల్లులు తమ కెరీర్‌లో అడ్డంకులను ఎదుర్కొంటున్నారు. దాదాపు 75 శాతం మంది తల్లులది ఇదే పరిస్థితి. 'వాయిస్ ఆఫ్ ఉమెన్' అధ్యయనంలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. 560 కంటే ఎక్కువ కంపెనీలలో 24,000 మంది మహిళా ఉద్యోగులను ఈ అధ్యయనంలో భాగంగా సర్వే చేశారు. అధ్యయనం ప్రకారం.. భారత్‌లో కార్పొరేట్ రంగంలో పని చేసే తల్లులు గణనీయమైన సవాళ్లతో పోరాడుతున్నారు. ప్రసూతి సెలవుల తర్వాత తల్లులు ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నారు. 75 శాతం మంది పని చేసే తల్లులు ప్రసూతి సెలవు నుంచి తిరిగి వచ్చిన తర్వాత ఒకటి నుంచి రెండు సంవత్సరాల వరకు కెరీర్‌లో వైఫల్యాన్ని నివేదించారు. ఈ మహిళల్లో దాదాపు 40 శాతం మంది ప్రసూతి సెలవుపై వెళ్లటం వారి వేతనాన్ని దెబ్బతీస్తున్నది. చాలామంది ఉద్యోగాల్లో తమ స్థానాలను వారు ఇష్టపడని స్థానాలకు మార్చినట్టు గుర్తించారు. పని ప్రదేశాల్లో మహిళలకు పక్షపాతం, వివక్ష ఎదురవుతున్నది. సర్వేలో పాల్గొన్న మహిళల్లో దాదాపు సగం మంది పనిలో పక్షపాతాన్ని అనుభవిస్తున్నట్టు వివరించారు. 37 శాతం మంది వారు సున్నితమైన ప్రవర్తనను ఎదుర్కొన్నట్టు వెల్లడించారు. ఇంకా, ఆరు శాతం మంది లైంగిక వేధింపులను ఎదుర్కొంటున్నట్టు నివేదించారు. వీటిలో సగం కంటే తక్కువ కేసులే అధికారికంగా నివేదించబడటం గమనార్హం. సీనియర్ మేనేజ్‌మెంట్, లీడర్‌షిప్ రోల్స్‌లో ఉన్న మహిళలు ఎంట్రీ-లెవల్ స్థానాల్లో ఉన్నవారితో పోలిస్తే రెండింతలు వివక్షను ఎదుర్కొంటున్నారు. 34 శాతం మంది సీనియర్ మహిళలు, 17 శాతం ప్రవేశ స్థాయి మహిళలు పక్షపాతాన్ని ఎదుర్కొంటున్నట్టు నివేదించారు.

## పాలస్తీనా కోసం మౌన ప్రదర్శన

- జీన్ డ్రేజ్, అన్నీ రాజాను అదుపులోకి తీసుకున్న ఢిల్లీ పోలీసులు

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని న్యూఢిల్లీలో పాలస్తీనా ప్రజలకు సంఘీభావం తెలుపుతూ మౌన ప్రదర్శన చేస్తున్న ఆర్థికవేత్త జీన్ డ్రేజ్, సీపీఐ నాయకుడు అన్నీ రాజా సహ ప్రముఖ కార్యకర్తలను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిరసన గురించి కార్యకర్తలు పోలీసులకు సమాచార మందించి నప్పటికీ అరెస్ట్ చేయటం గమనార్హం. గాజాలో తక్షణ కాల్పుల విరమణను డిమాండ్ చేస్తూ.. పాలస్తీనా కోసం వీరు నిర్వహించిన మార్చ్.. ఖాన్ మార్కెట్ ప్రాంతం నుంచి ప్రారంభమై ఇజ్రాయెల్ రాయబార కార్యాలయం వైపు వెళుతుండగా పోలీసులు అడ్డుకున్నారు. "మేము నినాదాలు కూడా చేయలేదు. కానీ బ్యానర్లతో నిశ్శబ్దంగా నిలబడి ఉన్నాం. కానీ దురదృష్టవశాత్తు, పోలీసులు మమ్మల్ని అదుపులోకి తీసుకున్నారు'" అని డ్రేజ్ అన్నారు. పాలస్తీనాపై దాడులను ప్రారంభించిన ఇజ్రాయెల్‌తో అన్ని సంబంధాలనూ వెంటనే ముగించాలని భారత ప్రభుత్వాన్ని కోరిన సామాజికవేత్తలు, కార్యకర్తలు ఈ నిరసనకు హాజరయ్యారు. భారతదేశం సంతకం చేసి, ఆమోదించిన జెనోసైడ్ కన్వెన్షన్ ప్రకారం మారణహోమాన్ని నిరోధించటానికి భారత్ అన్ని చర్యలనూ తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



పాలస్తీనా ప్రజలకు సంఘీభావం తెలుపుతూ మౌన ప్రదర్శన చేస్తున్న ఆర్థికవేత్త జీన్ డ్రేజ్, సిపిఎం నాయకుడు అన్నీ రాజా




# కోటి రూపాయల విరాళంతో..

కేరళ వయనాడ్ వరద బాధితుల కోసం తాజాగా అలనాటి దక్షిణాది హీరోయిన్లు కోటి రూపాయల విరాళాన్ని కేరళ సీఎం పినరయి విజయన్‌కు అందచేశారు. మీనా, కుష్బు, సుహాసిని, మరికొంతమంది కేరళ సీఎంకు కోటి రూపాయల చెక్కు అందచేశారు. ఈ ఫోటోలని సీనియర్ నటి మీనా తన సోషల్ మీడియాలో షేర్ చేశారు. 'చెన్నై నుంచి మేము కొంతమంది ఫ్యామిలీలు, ఫ్రెండ్స్ తరపున వయనాడ్ బాధితుల కోసం కోటి రూపాయల డబ్బులు పోగేసాం. కేరళ సీఎం పినరయి విజయన్ గారిని కలిసి కోటి రూపాయల చెక్కుని అందించాము. ఇందుకు సహకరించిన సుహాసిని, శ్రీప్రియ, కుష్బు, కళ్యాణి ప్రియదర్శన్, లిస్సి లక్ష్మి, శోభన.. వీరి ఫ్యామిలీలకు అభినందనలు. వయనాడ్ కోసం మేము ప్రార్థిస్తున్నాము' అని కూడా పోస్ట్ చేశారు.

## సుహాస్, కీర్తి 'ఉప్పు కప్పురంబు'



సుహాస్, కీర్తి సురేష్ జంటగా 'ఉప్పు కప్పురంబు' అనే సినిమా రాబోతుంది. అమెజాన్ ప్రైమ్ రూపొందిస్తున్న ఈ సినిమా నేరుగా ఓటీటీలో రిలీజ్ అవుతోంది. ఐ.వి. శశి దర్శకత్వంలో ఎల్లనార్ ఫిల్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌పై రాధికా లావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దీనికి వసంత్ మురళీకృష్ణ మరింగంటి కథ అందించారు. ముంబై వేదికగా జరిగిన ప్రైమ్ ఈవెంట్‌లో ఈ ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. తాజాగా ఈ చిత్రం షూటింగ్ ముగించారు. ఈ సందర్భంగా సుహాస్ కీర్తి సురేష్‌తో కలిసి ఉన్న పిక్‌ని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

## అన్ని థియేటర్లలోనూ 'ది గోట్'

తమిళ హీరో దళపతి విజయ్ నటిస్తున్న తాజా చిత్రం 'ది గోట్' సరికొత్త రికార్డులు దిశగా అడుగులు ముందుకు వేస్తోంది. పలు డబ్బింగ్ సినిమాలతో ఎప్పటికప్పుడు ఆయన అలరిస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్ (ద గోట్)' పేరుతో సినిమా తెరకెక్కుతోంది. వినాయక చవితి సందర్భంగా సెప్టెంబర్ 5న ఈ సినిమా విడుదల కానుంది. ఇప్పుడు ఈ చిత్రం అరుదైన రికార్డు నెలకొల్పేందుకు సిద్ధమైంది. 'ద గోట్' తర్వాత మరో సినిమా విజయ్ చేయనున్నారు. ఆ తర్వాత నటనకు పూర్తిగా దూరమవుతారు. గతంలో ఈ విషయాన్ని ఆయన ప్రకటించారు. ఇకపై పూర్తిగా రాజకీయాలకే అంకితమవుతారని వెల్లడించారు. 2026లో తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలోనే విజయ్ లేటెస్ట్ మూవీ విషయంలో నిర్మాతలు ఆశ్చర్యకర నిర్ణయాన్ని తీసుకున్నారు. 'ద గోట్' సినిమాను తొలిరోజు తమిళనాడు లోని అన్ని థియేటర్లలో ప్రదర్శించనున్నారు.

## డిసెంబర్ 10న 'అవతార్ 3' విడుదల




హాలీవుడ్ సినిమా 'అవతార్' రికార్డులను తిరగరాసింది. 2009లో తొలిభాగం విడుదలైంది. మళ్లీ 2022లో సీక్వెల్ రిలీజ్ చేశారు. మొత్తం ఐదు భాగాలుగా తెరకెక్కిస్తున్నట్లుగా మేకర్లు గతంలోనే ప్రకటించారు. ఇప్పుడు మూడో పార్టు పేరుతో విడుదల తేదీని అధికారికంగా మేకర్లు ప్రకటించారు. జేమ్స్ కామెరూన్ తీసిన 'అవతార్' తొలిభాగం అప్పట్లో వసూళ్లలో ప్రపంచ రికార్డులను సృష్టించింది. దీన్ని పండోరా గ్రహంలో భూమిపై తీయగా... 'అవతార్ : ద వే ఆఫ్ వాటర్'పేరుతో వచ్చిన రెండో భాగాన్ని కూడా పూర్తిగా నీటిలో తీశారు. ఇప్పుడు మూడో భాగానికి 'అవతార్ : ఫైర్ అండ్ యాష్ ' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. పంచ భూతాల్లో మూడోదైన అగ్ని కాన్సెప్ట్ బేస్ చేసుకుని దీన్ని తీస్తారనేది తెలిసింది. 'అవతార్' సినిమాను డిసెంబర్ 19న థియేటర్లలో విడుదల చేస్తామని మేకర్లు తాజాగా ప్రకటించారు. ఇంకా మిగిలిన నాలుగు, ఐదు పార్టులను 2027, 2029లలో విడుదల చేస్తామని ప్రకటించారు. అయితే వాటి పేర్లు, రిలీజ్ డేట్లు ఇంకా ప్రకటించాల్సివుంది.




# రజతం అయినా సంతోషమే

- ఆర్షాద్ మంచి మిత్రుడు
- జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా
- నేటితో ముగియనున్న ఒలింపిక్స్
- రా.12.30గం.ల నుంచి



**పారిస్:** పారిస్ ఒలింపిక్స్ జావెలిన్ త్రో విభాగంలో రజత పతకం సాధించిన నీరజ్ చోప్రా ట్విటర్(ఎక్స్) వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్నాడు. ఈసారి ఒలింపిక్స్‌లో జాతీయగీతం ఆలపించలేకపోయినందుకు బాధగా ఉందని, రజత పతకం సాధించడం పట్ల సంతోషంగా ఉన్నట్లు తెలిపాడు. టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం సాధించి తొలిసారి జాతీయ గీతాన్ని ఆలపించానని, కానీ పారిస్ ఒలింపిక్స్‌లో ఆ ఫీట్‌ను అందుకోలేక పోయినందుకు బాధగా ఉందన్నాడు. ఈసారి కూడా జాతీయ గీతం ఆలపించే భాగ్యం దక్కి ఉంటే బాగుండేదని, ఫైనల్ పోటీ రన్ అప్‌లో కొన్ని సమస్యలను ఎదుర్కొన్నానని, అందువల్లే నాలుగుసార్లు ఫౌల్‌కు గురయ్యానని తెలిపాడు. ఒకటి, రెండుసార్లు ఇది ఉద్దేశ్యపూర్వకంగానే జరిగినా.. వేసిన రెండు త్రోలు పతకాన్ని సంధించి పెట్టే త్రోలేనని అన్నాడు. ఎంత పెద్ద ఛాంపియన్ అయినా ఎప్పుడూ గెలుపునే ఆస్వాదించలేడని, ఫలితం ఒక్కోసారి వ్యతిరేకంగానూ రావొచ్చన్నాడు. మైదానంలో తాను ఎప్పుడూ సీరియస్‌గానే ఉంటానని, ఇది ఒక రకంగా మంచిదేనని, స్వర్ణ పతకం సాధించిన ఆర్షాద్ నదీమ్(పాకిస్తాన్), తాను మంచి మిత్రులమని వెల్లడించాడు. ఆధునిక ఒలింపిక్స్‌లో భారత జాతీయ గీతం ఇప్పటివరకు ఏడుసార్లు మాత్రమే ప్రదర్శించగలిగింది. స్వర్ణ పతకం సాధించిన దేశం జాతీయ గీతాన్ని ఆటగాళ్లకు పతకాలు అందజేసేటప్పుడు ప్రదర్శించడం ఆనవాయితి.

### భారత ఫ్లాగ్ బేరర్లుగా శ్రీజేశ్, మను..

పారిస్ ఒలింపిక్స్ నేటితో ముగియనున్నాయి. జులై 26న ప్రారంభమైన 33వ ఒలింపిక్స్.. ఆగస్టు 11న జరిగే ముగింపు ఉత్సవాలతో పూర్తికానున్నాయి. ఒలింపిక్స్ చరిత్రలో తొలిసారి స్టేడియం బయట ఒక నదిలో ప్రారంభోత్సవాలు జరగడం ఇదే తొలిసారి. అలాగే ముగింపు ఉత్సవాలు కూడా అక్కడే జరగనున్నాయి. ఇక భారత బృందానికి ముగింపు ఉత్సవాలలో ఫ్లాగ్ బేరర్లుగా హాకీ గోల్ కీపర్ శ్రీజేశ్, షూటర్ మను బాకర్ ఎంపికయ్యారు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో భారత్ ఏడు (1స్వర్ణ, 2రతజ, 4కాంస్య) పతకాలను సాధించగా.. ఈసారి ఆరు (1రజత, 5కాంస్యం) పతకాలకే పరిమితమైంది. రెండంకెల పతకాలే లక్ష్యంగా బరిలోకి దిగిన 117మంది అథ్లెట్లతో కూడిన భారత బృందం విఫలమైంది.పాకిస్తాన్ జావెలిన్ త్రోయర్

### నదీమ్‌కు అత్యున్నత పౌరపురస్కారం, బంగారు కిరీటం..

పారిస్ ఒలింపిక్స్ జావెలిన్ త్రోలో స్వర్ణ పతకం గెలిచి చరిత్ర సృష్టించిన పాకిస్థాన్ అథ్లెట్ ఆర్షాద్ నదీమ్ ప్రతిభపై సర్వత్రా ప్రశంసలు కురుస్తున్నాయి. పలువురు క్రికెటర్లు, సెలబ్రిటీలతోపాటు పాకిస్తాన్ ప్రభుత్వం ఘనంగా సత్కరించనుంది. అలాగే రూ.4.5 కోట్ల నగదు బహుమతి అందించనున్నారు. ఆర్షాద్ నదీమ్ ప్రతిభకు గుర్తింపుగా అత్యున్నత పౌర పురస్కారంతో సత్కరించాలని పాకిస్తాన్ జాతీయ అసెంబ్లీ ప్రభుత్వానికి సిఫార్సు చేస్తూ ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు అక్కడి రేడియో పాకిస్తాన్ వెల్లడించింది. నదీమ్ స్వదేశానికి చేరుకోగానే బంగారు కిరీటంతో సత్కరించనున్నట్లు సింధ్ ప్రభుత్వం వెల్లడించింది. సుక్కురులోని కొత్త స్పోర్ట్స్ స్టేడియానికి నదీమ్ పేరు పెట్టనున్నట్లు అక్కడి అధికారులు తెలిపారు. కరాచీలో 'అర్షాద్ నదీమ్ అథ్లెటిక్స్ అకాడమీ'ని ప్రారంభించనున్నట్లు నగర మేయర్ ముర్తుజా వహబ్ ప్రకటించారు. నదీమ్‌కు సోలార్ ఎనర్జీ సిస్టమ్‌ను అందించనున్నట్లు అక్కడి ప్రముఖ సోలార్ ఎనర్జీ కంపెనీ బీకన్ ఎనర్జీ వెల్లడించింది. ఆర్థిక ఇబ్బందులతో పారిస్ ఒలింపిక్స్‌లో 92.97 మీటర్లు జావెలిన్ విసిరి.. 32ఏళ్ల తర్వాత ఒలింపిక్ పాకిస్తాన్‌కు స్వర్ణ పతకాన్ని అందించిన సంగతి తెలిసిందే.

### రెజ్లర్ రితికకు చుక్కెదురు

ఒలింపిక్స్ బరిలో ఉన్న ఆఖరి రెజ్లర్ రితికా హుడాకు చుక్కెదురైంది. మహిళల 76కిలోల ఫ్రీ స్టయిల్ విభాగంలో ఆమె పోరాటం క్వార్టర్ ఫైనల్లోనే ముగిసింది. శనివారం జరిగిన బౌట్‌లో కిర్గిస్థాన్‌కు చెందిన టాప్ సీడ్ ఐపెరి మెడెట్ కిజీ చేతిలో రితికా ఓటమి పాలైంది.

తొలి రౌండ్‌లో 1–0తో ఆధిక్యం కనబరిచిన ఆమె ఆ తర్వాత కూడా జోరు చూపింది. ఐపెరి సైతం ఓ పాయింట్ సాధించగా 1–1తో స్కోర్ సమం అయింది. అయితే.. అనూహ్యంగా జడ్జిలు ఐపెరిని విజేతగా ప్రకటించారు. ఆరు నిమిషాల పాటు జరిగిన బౌట్‌లో చివరి టెక్నికల్ పాయింట్ సాధించిన ఆమెను సెమీస్‌కు వెళ్లింది. దాంతో, రితిక 3–1తో ఓడి సెమీస్ చాన్స్ చేజార్చుకుంది. ఒకవేళ ఐపెరి ఫైనల్‌కు దూసుకెళ్తే రితికకు రెపెచేజ్ రౌండ్‌లో ఆడే అవకాశం ఉంటుంది. అంతకముందు జరిగిన ప్రి క్వార్టర్స్‌లో రితిక 12–2తో హంగేరికి చెందిన నగీపై గెలుపొంది క్వార్టర్స్‌లో అడుగుపెట్టింది.

## వినేశ్ అప్పీల్‌పై తీర్పు 13కు వాయిదా

రెజ్లింగ్ వినేశ్ ఫోగాట్ తీర్పును 'కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్' వాయిదా వేసింది. తొలుత శనివారం(10న) తీర్పును వెలువరిస్తామని ప్రకటించిన కోర్టు చివరి క్షణంలో 13కు తీర్పును వాయిదా వేసింది. ఒలింపిక్స్ ముగిసేలోపు వినేశ్‌పై తీర్పును వెలువరిస్తామని పేర్కొన్న కోర్టు చివరి క్షణంలో ఈ నిర్ణయం తీసుకుంది. 100 గ్రాములు అదనపు బరువు కారణంగా పతకం కోల్పోయిన వినేశ్ ఫొగాట్.. తనకు రజత పతకం ఇవ్వాలని అప్పీలులో కోరారు. ఒకవేళ తీర్పు వినేశ్‌కు అనుకూలంగా వస్తే.. ఐఒసి ఆమెకు సంయుక్తంగా రజత పతకం ఇవ్వాల్సి వుంటుంది. ఈ పరిణామాల నేపథ్యంలోనే వినేశ్ రెజ్లింగ్‌కు రిటైర్‌మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే.



టీమిండియా యువ క్రికెటర్ జితేశ్ శర్మ ఇంటివాడయ్యాడు. శుక్రవారం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ షలక ముకేశ్వర్‌ను వివాహం చేసుకున్నాడు. ఇరువురు కుటుంబసభ్యుల సమక్షంలో సంప్రదాయంగా వీరి వివాహం జరిగింది. ఫొటోలను జితేశ్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు.

## పతకాల్లో చైనాకు అగ్రస్థానం

### అమెరికాకు ఈసారి 2వ స్థానమే..



**పారిస్:** 2020 టోక్యో ఒలింపిక్స్ పతకాల పట్టికలో 2వ స్థానానికి పరిమితమైన చైనా.. ఈసారి అమెరికాకు ముచ్చెమటలు పట్టించింది. తొలిరోజునుంచి తన హవా కొనసాగిస్తూ.. ముగింపు ఉత్సవాలకు ఒక రోజు ముందు నాటికి 37స్వర్ణాలతో అగ్రస్థానంలోనే నిలిచింది. ఒకటి, రెండు రోజులు అమెరికా చివర్లో అగ్రస్థానంలో నిలిచినా.. మొత్తమ్మీద చైనా స్పష్టమైన ఆధిక్యతను ప్రదర్శించింది. మొత్తం పతకాల పరంగా అమెరికా(114) అగ్రస్థానంలో ఉన్నా.. స్వర్ణ పతకాల్లో చైనా తన స్పష్టమైన ఆధిక్యతను ఈ ఒలింపిక్స్‌లో కనబర్చింది. ఈత కొలను, జిమ్నాస్టిక్స్, అథ్లెటిక్స్ విభాగాల్లో అమెరికా తన ఆధిక్యతను ప్రదర్శించగా.. డైవింగ్, టేబుల్ టెన్నిస్, షూటింగ్, ఆర్చరీ, తదితర విభాగాల్లో చైనాకు అత్యధిక పతకాలు దక్కాయి. నేటితో పారిస్ ఒలింపిక్స్ ముగియనుండగా.. ఇప్పటికీ చైనా అగ్రస్థానంలో ఉంది. శనివారం జరిగిన మహిళల ఫుట్‌బాల్ ఫైనల్లో అమెరికా1–0తో బ్రెజిల్‌ను ఓడించి స్వర్ణం చేజిక్కించుకోగా.. జర్మనీకి కాంస్య పతకం దక్కింది. ఇక పురుషుల విభాగంలో స్పెయిన్ 5–3గోల్స్ తేడాతో ఫ్రాన్స్‌ను ఓడించి స్వర్ణ పతకం సాధించగా.. మొరాకోకు కాంస్య దక్కింది.

**పతకాల పట్టిక(టాప్-10)**

| దేశం | స్వ | ర | కా | మొ |
|---|---|---|---|---|
| 1. చైనా | 37 | 27 | 24 | 88 |
| 2. అమెరికా | 34 | 41 | 39 | 114 |
| 3. ఆస్ట్రేలియా | 18 | 17 | 14 | 49 |
| 4. జపాన్ | 16 | 10 | 13 | 39 |
| 5. ఫ్రాన్స్ | 15 | 21 | 22 | 58 |
| 6. బ్రిటన్ | 14 | 20 | 24 | 58 |
| 7. ద.కొరియా | 13 | 8 | 8 | 29 |
| 8. నెదర్లాండ్స్ | 13 | 6 | 11 | 30 |
| 9. జర్మనీ | 12 | 9 | 8 | 29 |
| 10. ఇటలీ | 11 | 12 | 14 | 37 |
| 69. ఇండియా | 0 | 1 | 4 | 5 |

గమనిక: స్వ:స్వర్ణం, ర:రజతం; కా:కాంస్యం; మొ:మొత్తం






## మీకోసం

ఒక కప్పు ఉసిరి పొడి, రెండు కప్పుల పెరుగు కలిపి రాత్రంతా నాననిచ్చి, మరుసటి రోజు తలకు పట్టించి, ఒక గంట తర్వాత కడిగేయాలి. వారానికోసారి ఇలా చేస్తుంటే తెల్లజుట్టు నల్లబడుతుంది.

## జీవన సౌరభం

చేయగలిగే శక్తి ఉన్నవాడికంటే, చెయ్యాలనే కోరిక, సంకల్పం ఉన్నవాడు ఎక్కువ చెయ్యగలడు.




## భరత మాత బిడ్డలం



భరత మాత బిడ్డలం
బడికి వెళ్లే బాలలం

వందేమాతరం ఆలపిస్తాం
జన గణ మన పాడుతాం
గాంధీ తాత బోసి నవ్వులం
చాచా నెహ్రూ కోటు పువ్వులం

భరత మాత బిడ్డలం
బడికి వెళ్లే బాలలం

చదువుల్లో ముందుంటాం
ఆట,పాటల్లో మేటంటాం
పెద్దలందరిని గౌరవిస్తాం
గురువులందరిని పూజిస్తాం

భరత మాత బిడ్డలం
బడికి వెళ్లే బాలలం

అహింసే మా ఆయుధం
న్యాయమే మా మార్గం
నిజాయితీతో మెలుగుతాం
ధైర్యంతో ముందుకు సాగుతాం

భరత మాత బిడ్డలం
బడికి వెళ్లే బాలలం

– ఏడుకొండలు కళ్ళేపల్లి,
మచిలీపట్నం, 94908 32338.

## సరైన అక్షరాలు రాయండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని తెలుగు పదాలు ఇచ్చాం. అయితే వాటిలో కొన్ని అక్షరాలు లేవు. ఇచ్చిన క్లూ ఆధారంగా ఆ అక్షరాలను మీరు రాయండి.

నె, రా-ధా, డే, చే, మీ, హం, గు-జా, మ్య, హా

| | |
|---|---|
| జ-ందారు | -మలి |
| మ-రాజు | -జ-ని |
| -గరాజు | జ- |
| తో-లు | -ప |
| -ర-డ | -స |

## నేను గీసిన బొమ్మ



బి.విశ్వ తేజ,
ఆరవ తరగతి,
అనంత సాగర్,
సిద్దిపేట జిల్లా.







టి.వీక్షిత్,
2వ తరగతి,
సత్యా ది స్కూలు,
తిరుపతి.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

# రంగస్థలంపై బహుముఖ పాత్రధారి

**గంగోత్రి సాయి... రంగస్థలంలో బహుముఖ ప్రజ్ఞ ఆయన సొంతం. ఆయన నటుడు, దర్శకుడు, రచయిత, వివిధ నాటక రంగ అంశాల్లో సాంకేతిక నిపుణుడు కూడా. అనేక నాటికలు, నాటకాలు, సినిమాల్లో గంగోత్రి సాయి విశేష ప్రతిభ కనబర్చారు. అరవింద్ ఆర్ట్స్ సంస్థ ద్వారా తెలుగునాట ఆయన నేతృత్వంలో ప్రదర్శించిన నాటికలు, నాటకాలు అనేకం ఉన్నాయి. అనేక పురస్కారాలూ, ప్రశంసలూ ఆయన్ని వరించి వరించాయి.**

గంగోత్రి సాయిగా చిరపరిచితుడైన దాసరి చలపతిరావు రేపల్లె తాలూకా నగరం మండలం కొలగానివారిపాలెంలో 30 జులై 1964న రామారావు, చెలవమ్మ దంపతులకు జన్మించారు. హైస్కూలు స్థాయిలోనే ఏకపాత్రాభినయం, మిమిక్రీతోపాటుగా పలు నాటిక పోటీల్లో పాల్గొనేవారు. ప్రస్తుతం మంగళగిరిలోని సి.కె.బాలుర ఉన్నత పాఠశాలలో వ్యాయామోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. తాడేపల్లిలో 'ప్యారీ' కంపెనీలో పనిచేసే కొద్దిమంది కళాకారులు నాటకాలకు రిహార్సల్స్ చేసేవారు. నాటకరంగంలో అప్పట్లో లెజెండ్‌గా ఉన్న అన్నపరెడ్డి శివరామిరెడ్డి (నూతక్కి) వీరికి శిక్షణ ఇచ్చేవారు. కొన్నిరోజుల పాటు వీటిని పరిశీలించిన సాయి ఆ తర్వాత తను కూడా నాటకాల్లో నటించాలని భావించి శివరామిరెడ్డి వద్ద శిష్యరికం చేశారు. అలా 1990లో నాటకరంగ ప్రవేశం చేశారు. ఆయన వద్ద డైలాగులు, నటన, ఇతర పాత్రల్లోని మెళకువలను నేర్చుకున్నారు.



**గంగోత్రి నుంచి అరవింద్ ఆర్ట్స్ వరకూ...**

గతంలో గంగోత్రి నాటక సమాజం ద్వారా అనేక నాటక, నాటిక ప్రదర్శనల్లో సాయి నటించేవారు. కాలక్రమంలో నాటక సమాజాలకు ఆదరణ కరువైన నేపథ్యంలో నాటక ప్రదర్శనలు సరిగా జరిగేవి కాదు. ఈ క్రమంలో తన స్నేహితుడు చాగంటి చంద్రశేఖర్‌రెడ్డి ప్రోత్సాహంతో 2004లో అరవింద ఆర్ట్స్ సంస్థను ఏర్పాటు చేశారు. ప్రముఖ రచయిత వల్లూరు శివప్రసాద్, ప్రముఖ సినీ రచయిత ఆకెళ్ల, కావూరి సత్యనారాయణ, డాక్టర్ డి.విజయభాస్కర్ తదితరుల రచనలతో ఎక్కువ నాటకాలు, నాటికల ప్రదర్శనలు ఇచ్చారు. 1992లో భిలాయి బహుబాషా నాటకోత్సవాల్లో ప్రదర్శించబడి, తృతీయ ఉత్తమ ప్రదర్శన బహుమతి పొందిన 'తిమిరం' నాటిక ద్వారా ఎ.శివరామిరెడ్డి దర్శకత్వంలో నటుడిగా సాయి వెలుగులోకి వచ్చారు. 1994లో గంగోత్రి పెదకాకాని నాటక సమాజంలో అడుగుపెట్టారు. 12 ఏళ్లపాటు నాటికలు, నాటకాల్లో వైవిధ్యభరితమైన పాత్రలు ధరించి బహుమతులు పొందారు. నాటక రంగంలో గంగోత్రిసాయిగా గుర్తింపు పొందారు. 2004లో అరవింద ఆర్ట్స్ నాటక సమాజాన్ని స్థాపించారు.



'మధుపర్కాలు' ప్రదర్శనలో ఓ సన్నివేశంలో సాయి..

### సామాజిక చైతన్యమే లక్ష్యంగా ...

భావితరాలకు నాటక రంగం సమగ్ర చరిత్రను అందించేందుకు కృషిచేస్తున్నాం. మా ప్రదర్శనలు సామాజిక ప్రయోజనమే లక్ష్యంగా రూపొందిస్తున్నాం. తెలుగు నాటక రంగంలో జరిగిన కృషిని అందరూ గుర్తు పెట్టుకునేలా పుస్తక ప్రచురణ, ఫొటోల తయారీ, చరిత్ర కూర్పు వంటి పనులను చూపడుతున్నాం.

– గంగోత్రిసాయి
అరవింద్ ఆర్ట్స్ అధినేత.

ఏరువాక సాగాలి, ఏకాకి నౌక చప్పుడు, దేవుడా! దేవుడా!!, ధ్వంస రచన, రంకె, పడుగు, క్షతగాత్రగానం, ఆగ్రహం, స్వర్గానికి వంతెన, మనస్విని, ఏటిలోని కెరటం, అరవైదాటారు ఎందుకు?, నక్షత్రం, జరుగుతున్న కథ, అదుగో వాళ్ల పల్లె .. వంటి నాటికల్లో నటించారు. పలు నాటికలకు దర్శకత్వం వహించారు. ఇదొక విషాదం,మీ ఇల్లెక్కడ, కొత్త నాయకుడు, ఇంటింటి బాగోతం, పరుగు, బొమ్మా బొరుసా, ఋషి, బహుజన హితాయ, నక్షత్రం, అన్నా జిందాబాద్, మీ ఇల్లెక్కడ .. వంటి నాటకాలు ఆయనకు అనేక బహుమతులను తెచ్చి పెట్టాయి.

**సామాజిక అంశాలే ఇతి వృత్తాలుగా ...**

అరవింద ఆర్ట్స్ ద్వారా తాడేపల్లి కేంద్రంగా గత 30 సంవత్సరాలుగా వందలాది నాటిక, నాటక ప్రదర్శనలు ఇచ్చారు. రైతుల ఆత్మహత్యలపై ప్రదర్శితమైన నాటిక 'రంకె' అన్నదాత అగచాట్లను ఎత్తి చూపింది. భీమవరానికి చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆత్మహత్య చేసుకుందామని అనుకుంటున్న పరిస్థితుల్లో ఈ నాటికను చూసి, ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారట! 'పడుగు' నాటిక చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న దీన పరిస్థితులను తెలియజేసే మరో నాటిక. ఈ నాటిక నంది బహుమతితోపాటు ప్రేక్షకుల నీరాజనాలను అందుకుంది. బహుభాషా నాటకోత్సవాల్లో ప్రదర్శించబడి నాటకాభిమానుల ప్రశంసలు పొందింది. ఇంకా వల్లూరు శివప్రసాద్ రచనలు 'ఏరువాక సాగాలి, ఏకాకి నౌక చప్పుడు, దేవుడా! దేవుడా!!, ధ్వంసరచన, రంకె, పడుగు, క్షతగాత్రగానం, ఆగ్రహం, స్వర్గానికి వంతెన, మనస్విని, ఏటిలోని కెరటం వంటి నాటికలు ఆయన దర్శక నటనా నేతృత్వంలో ఎన్నో బహుమతులను గెలుపొందాయి.

**నాటక సాహిత్య ప్రచురణ**

అరవింద ఆర్ట్స్ సంస్థ ద్వారా ప్రచురణ ద్వారా కూడా సేవ చేస్తున్నారు. 2010లో 'రూపిక' నాటక రంగ వ్యాస సంకలనం, 2012లో ఆకెళ్ల ఇదొక విషాదం, మీ ఇల్లెక్కడ నాటకాలను; ఆకెళ్ల నాటకాలు 2వ సంపుటాన్ని ప్రచురించారు. అలాగే 'నాటక రంగ ప్రముఖులు' ఛాయాచిత్రాలను సేకరించి లక్షలాది రూపాయలు వ్యయం చేసి ఫ్రేములుగా తయారు చేయించారు. రాజమండ్రి, తిరుపతి, గుంటూరు, అవనిగడ్డలో ఫొటో ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. 2016లో 'నాటకరంగ ప్రముఖులు' కళాకారుల, రచయితల సంక్షిప్త పరిచయంతో పుస్తకంగా ప్రచురించి నంది నాటకాల్లో ఆవిష్కరించారు. వావిలాల నరసింహారావు రాసిన 'ఈ వైరమింకెంతకాలం' (2021) పౌరాణిక నాటకం ప్రచురించారు. 2010లో 'ప్రసిద్ధ తెలుగు నాటికలు', (58) 'ప్రసిద్ధ తెలుగు హాస్యనాటికలు' (50) సంకలనాలకు, 2016లో ప్రచురించిన 'ప్రసిద్ధ బాలల నాటికలు' (1912–2000) సంకలనానికి ఉప సంపాదకుడిగా వ్యవహరించారు. ప్రసిద్ధ తెలుగు నాటకాలు ఆరు సంకలనాలను (1880–2020) 100 నాటకాలతో తానా సంస్థవారితో కలిసి ప్రచురించారు.

**నందులు, పురస్కారాలు**

నంది నాటకోత్సవాల్లో గంగోత్రి సాయి ప్రదర్శించిన నాటికలు ఐదు బంగారు నందులు, రెండు వెండి నందులు, రెండు కాంస్య నందులను అందుకున్నాయి. సాయి వ్యక్తిగతంగా ఉత్తమ దర్శకుడిగా నాలుగు నందులు, ఉత్తమ నటుడిగా రెండు నందులు, ఉత్తమ ప్రతి నాయకుడిగా రెండు నందులు, హాస్యనటుడు, రంగాలకరణకు కూడా నందులు గెల్చుకున్నారు. తెలుగు విశ్వవిద్యాలయం వారి కీర్తి పురస్కారం, జవ్వాది రామారావు రంగస్థల పురస్కారం, కిన్నెర, హైదరాబాదు వారి ఎన్‌టిఆర్ రంగస్థల పురస్కారం మొదలైన ఎన్నో పురస్కారాలను అందుకొన్నారు.

– యడవల్లి శ్రీనివాసరావు

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68